అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి
1
శుక్రవారం 10 మార్చి 2023

'రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి'

నవతెలంగాణ-హుజూర్‌నగర్



సకాలంలో రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జన చైతన్య ట్రస్ట్ ఫౌండర్ పినపరాళ్ల వంశీ, నిర్వాహకులు పారా సాయి అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సతీష్ అనే వ్యక్తికి ఏ గ్రూప్ రక్తం అవసరం కాగా ట్రస్టు సభ్యులను సంప్రదించగా కోదాడ పట్టణంలో ఉన్న తమ ట్రస్టు సభ్యులు కారంగుల విశ్వనాథ్‌కు సమాచారం ఇచ్చి కోదాడ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయించినట్లు పినపరాల వంశీ తెలియజేశారు. ఇప్పటికీ 439 మందికి తమ ట్రస్ట్ తరపున రక్తదానం చేసినట్లు తెలిపారు.

మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి

నవతెలంగాణ- మోతే

సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే నరసమ్మ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని రావి పహాడ్ గ్రామంలో అంతర్జాతీయ శ్రామిక పోరాట దినంలో భాగంగా నీలమ్మ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా ఉద్యోగాలలో పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను కోరారు .ఈ కార్యక్రమంలో ప్రజల శీల మహిళా సంఘం నాయకురాలు శీలం భవాని కొత్తపెల్లి నీలమ్మ మహేశ్వరి కుడపంగి అంతమ్మ మహబూబా ఎల్లమ్మ వెంకటమ్మ జాన్ అమ్మ నాగమణి పి ఓ ఎల్ ప్రధాన కార్యదర్శి సైదులు నాయకులు కాకి మోహన్ రెడ్డి ముత్తయ్య లింగయ్య పాల్గొన్నారు.



జోరుగా...
ఫామ్ ల్యాండ్ దందా

- మొక్కల పేరుతో ఎర...
- నాలా పన్ను, డీటీసీపీ అనుమతుల రుసుం ఎగవేత
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ఫామ్ ల్యాండ్ పేరుతో స్థిరాస్తి వ్యాపారం చేస్తూ కొత్త మోసానికి తెర తీశారు. నాలా పన్ను, డీటీసీపీ అనుమతులు అలాంటివి ఏమీ లేకుండా రైతు దగ్గర భూమి కొనుగోలు చేసి వాటిని ప్లాట్ల రూపంలో అనగా ఫామ్ ల్యాండ్ రూపంలో విక్రయించి లక్షలు గడిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి హైదరాబాద్ రాష్ట్ర రాజధాని కేవలం 40 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ఇక్కడ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాదాద్రి దేవస్థానం ఉండడం స్థిరాస్తి వ్యాపారులకు కలిసొచ్చే మరొక్క అంశం.

నవతెలంగాణ- భువనగిరి రూరల్

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం హైదరాబాద్‌కు దగ్గర్లో ఉండడంతో ఫామ్‌లాండ్ దందా జోరుగా సాగుతోంది. ఎర్రచందనం, శ్రీ గంధం, ఆపిల్ బీర్ మొక్కలను ఎరవేస్తూ ఫామ్ ల్యాండ్ వ్యాపారం చేస్తున్నారు. మొదటగా ఎకరంను రూ.80 లక్షలకు కొనుగోలు చేసి, ఒక గుంట, రెండు గుంటలు, 3 గుంటలు, ఐదు గుంటలుగా విభజించి అమ్ముతున్నారు. ఒక గుంటను రూ.4 లక్షల నుంచి 6 లక్షల వరకు విక్రయిస్తూ , సాగు భూమిగా రిజిస్ట్రేషన్ చేసి జేబులు నింపుకుంటున్నారు. ఇలాంటివి ఎకరం నుంచి 10, 20, 50, 100 ఎకరాల వరకు ఫామ్ ల్యాండ్ వెంచర్లు యాదాద్రి భువనగిరి జిల్లాలో కోకోలుగా ఉన్నాయి.

నాలా పర్మిషన్ లేకపోవడంతో ప్లాట్లు కొన్న వారికి ఇబ్బందులు...

ఫామ్ ల్యాండ్ వెంచర్ చేసేవారు ఎలాంటి ఇబ్బంది ఉండదని గుంటల్లాగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరుతూ వారిని నమ్మిస్తారు, వారికి కూడా ధర తక్కువ అనిపించడంతో ఏమీ ఆలోచించకుండా కొనుగోలు చేస్తారు. అవసరం వచ్చినప్పుడు సంబంధిత వాటిని అమ్మాలంటే నాలా పర్మిషన్ లేకపోవడంతో ఆ మొత్తం ల్యాండ్ వెంచర్ చేసే అమ్మిన వ్యక్తి పేరు మీదనే ఉంటుంది. కాగా వ్యక్తికి ధరణిలో సాగుదారుడిగా ఉండడంతో రైతుబంధు వస్తుంది, రైతు బీమా వర్తిస్తుంది. ప్రభుత్వ పథకాలు కూడా అక్రమార్కులకు ఆయుధంగా మారుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి, ఫామ్ ల్యాండ్ వెంచర్ చేసిన వివరాలు తెలుసుకొని వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చేయాల్సిన బాధ్యత ఉంది.ఫామ్‌లాండ్ వెంచర్లు చేసేటప్పుడు నాలా అనుమతులు(డీటీసీపీ, రేరాలాంటి) చిక్కులు ఉండవు. అందుకే చాలామంది ఫామ్ ల్యాండ్ వెంచర్ వైపు మొగ్గు చూపుతున్నారు.



ధరణిలో ఈ నిబంధనల ఊసేది...?

సాగు భూమిని భవిష్యత్తులో వ్యవసాయతేరఅవసరాలకు మార్చుకోవాలంటే ముందుగా ధరణి పోర్టల్‌లో ఉన్న విస్తీర్ణానికి నాలా పన్నులు చెల్లించాలి. గజాల చొప్పున వినియోగానికి స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరి. భవన, ఇతర నిర్మాణాలకు డీటీసీపీ, రెరా అనుమతులు పొందాలి. రహదారులు డ్రెయినేజీ, సామాజిక అవసరాలకు అవసరమైన భూమిని వదిలిన తర్వాత నిర్మాణాలు చేపట్టాలి. ప్రస్తుతం ఫామ్ ల్యాండ్ విక్రయాల్లో ఈ నిబంధనలు పాటించడం లేదు. వ్యాపారులు వేరొక్కరి దగ్గర వ్యవసాయ భూమిని కొని ముక్కలుగా చేసి అమ్మేస్తూ, చేతులు దులుపుకుంటున్నారు. హెచ్ఎండీఏ, డీటీసీపీ గతంలో చేసిన గ్రామపంచాయతీ లేఅవుట్ల కంటే తక్కువ ధరకు వస్తుండడంతో ప్రభుత్వ సహాయం వస్తుందని ఆశపడి ఉండేవారు భవిష్యత్తులో చాలా కష్టనష్టాలకు గురికావాల్సి వస్తుంది.

జిల్లాలో జోరుగా కొనసాగుతున్న ఫామ్ సైట్ వెంచర్లు....

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కువగా భువనగిరి, యాదగిరిగుట్ట, రాజాపేట, బీబీనగర్, తుర్కపల్లి, బొమ్మలరామారం, వలిగొండ, భూదాన్ పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలలో విచ్చలవిడిగా ఫామ్ సైట్ వెంచర్లు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

కొనుగోలుదారుల కష్టాలు...

కొనుగోలుదారులు తమ జాగాను ప్రస్తుతానికి వ్యవసాయ భూమిగానే కొనసాగించిన, భవిష్యత్తులో ఇబ్బందులు పడే అవకాశం ఉండవచ్చు. ఒక ఎకరం భూమిని కొన్నిచోట్ల 20 నుంచి 40 మంది కొనుగోలు చేసి ధరణిలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారు. ముందు ముందు ఆ స్థలాల్లోకి వెళ్లడానికి దారి వివాదాలు తలెత్తే ప్రమాదాలు ఉన్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వ్యవసాయేతర భూమి రిజిస్ట్రేషన్ కావాలంటే కనీసం 4 గుంటలు అనగా 484 చదరపు గజాలు ఉండాలనే నిబంధన ఉంది. దీనివలన భవిష్యత్తులో షెట్ బ్యాక్ పార్టీ సమస్యలు తీవ్రత తగ్గుతుంది. ధరణిలో అలాంటి నిబంధన లేదు, ఒక గుంటకు కూడా రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. కొనుగోలుదారులు ఇల్లు నిర్మించుకోవాలంటే సరిహద్దులు స్టేట్ బ్యాక్ జాగా విషయంలో పొరుగువారితో తగాదాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆ స్థలానికి చేరుకోవడానికి బాట (దారి) సమస్య ఏర్పడే ప్రమాదం ఉంది.

ఫామ్ ల్యాండ్ వెంచర్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు ఉండవు

ఫామ్‌ల్యాండ్ వెంచర్లో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు ఉండవు, వాటికోసం స్థలం కేటాయించకపోవడంతో ఇంటి నిర్మాణాలు చేపట్టేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఒకవేళ వ్యాపారులు రోడ్లు వేసిన అవి నిబంధనలకు అనుకూలంగా ఉండకపోవడంతో ఇల్లు నిర్మించుకున్న సమయంలో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.స్థలం కొనుగోలుదారుడు ఇల్లు కట్టుకోవాలంటే నాలా, ఎల్ఆర్ఎస్ రుసుములు తప్పనిసరి చెల్లించాలి,ఎల్ఆర్ఎస్‌కు అనుమతులు కష్టమవుతాయి నిబంధనల ప్రకారం లేకపోవడంతో ఇంటి నిర్మాణం బ్యాంకు రుణం అనందకపోవచ్చు.

మండలంలో సుమారు వెయ్యికి పైగా ఫామ్ ల్యాండ్ వెంచర్

భువనగిరి మండలంలోని వీరవెల్లి, చీమల కొండూరు, ముస్తాలపల్లి, రాయగిరి, బండ సోమవారం, చందుపట్ల, గౌస్ నగర్, కునురు, జమ్మాపురంతో పాటు మండల వ్యాప్తంగా ఫామ్ ల్యాండ్ వెంచర్లు ఉన్నాయి. కాగా వీరవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పామ్ ల్యాండ్ వెంచర్లో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు చేసినట్లు, సర్వేనెంబర్ 34 లో ప్రభుత్వ భూమి సంబంధించింది కబ్జా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇబ్బందులు పడుతున్నాము... బాధితుడు రాఘవేందర్..

భువనగిరి మండలంలోని ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో ప్లాటును కొనుగోలు చేశానని కబ్జాలో కొనుగోలు చేసిన వ్యక్తి ఉన్నప్పటికీ ధరణిలో ఓనర్ పేరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ఈ విషయంపైతహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను.

నాలా పర్మిషన్ డబ్బులు చెల్లిస్తే ఇబ్బందులుండవు-తహసీల్దార్ వెంకటరెడ్డి

ఫామ్ ల్యాండ్ వెంచర్‌లో కొనుగోలు చేసిన వారు నాలా పర్మిషన్ డబ్బులు చెల్లిస్తే వారికి ఇబ్బందులు ఉండవు, ముందుగా నాలో పర్మిషన్ చెల్లించాలి. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫామ్ ల్యాండ్ వెంచర్ లు, ప్రభుత్వ భూమి విషయం నా దృష్టికి రాలేదు.



కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- ప్రజలను చైతన్యం చేయడానికే జన చైతన్య యాత్రలు
- జిల్లా కమిటీ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ

బీజేపీ మతోన్మాద, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వీరారెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జూలకంటి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక, రైతు వ్యతిరేక, యువజన, విద్యార్థి, కార్మిక, మహిళా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేసేందుకు, కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఈనెల 17 నుండి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు జన చైతన్య యాత్రలు చేస్తున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రజల మీది నిత్యావసర సరుకుల ధరలు, ముడి చమురుల ధరలు ఇలా అనేక రకాల పద్ధతిలో భారాలు మోపుతూ ప్రజల నడ్డి విరుస్తూ నిరంకుశ పాలన చేస్తుందని తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని కలిగిన తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ మతోన్మాద ఆగడాలు సాగనివ్వమన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ఈనెల 17 నుండి 29 వరకు సాగే జనచైతన్య యాత్రలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ విధానాలతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం నిధుల కుదింపుతో పని దినాలు కోల్పోయి కనీస వేతనం కూడా రాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ పోడు పట్టాలివ్వాలని, ఇంటి స్థలం లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యల పరిష్కారానికి నల్లగొండ జిల్లాలో మార్చి 27 నుండి 28 వరకు జన చైతన్య బస్సు, మోటార్ సైకిల్ యాత్ర కొనసాగిస్తున్నట్లు తెలిపారు. యాత్ర సందర్భంగా మిర్యాలగూడ, నల్లగొండ, నకిరేకల్, చిట్యాల కేంద్రాల్లో పెద్ద ఎత్తున బహిరంగ సభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సభలలో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాతంత్ర శక్తులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేశం, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, కున్‌రెడ్డి నాగిరెడ్డి, కందాల ప్రమీల, సయ్యద్ హాశం, పాలడుగు ప్రభావతి, సీహెచ్.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ-చౌటుప్పల్



మున్సిపల్ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన బొడ్డు కవితకు మాజీ సర్పంచ్ ముటుకులోజు దయాకరచారి సహకారంతో గురువారం కేవీఎస్ ఫౌండేషన్ ఛైర్మన్ కొండ వండంగి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిట్టా కృష్ణయాదవ్, కొయ్యడ లింగస్వామి, ఎమ్‌డి.అస్లామ్‌ఖాన్, రాగీరు సత్యనారాయణ, సిలివేరు శేఖర్, గోపాల్‌రెడ్డి, మిద్దెల వీరేశం, శివ, వెంకటేశం, మహేశ్, ఉదయ్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు చంద్రమౌళి మృతి



- నమ్ముకున్న సిద్ధాంతాన్ని వీడలేదు
- రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ-నకిరేకల్

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు, శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన మారోజు చంద్రమౌళి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. చంద్రమౌళి గురజాల ఎంపీటీసీగా, సీపీఐ(ఎం) మండల కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు తదితరులు చంద్రమౌళి మృతదేహంపై ఎర్రజెండాను కప్పి జోహర్లు అర్పించారు. అనంతరం అంతిమయాత్ర సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోయేందుకు చంద్రమౌళి నిరంతరం కృషి చేశాడని పేర్కొన్నారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు నిర్వహించిన నాయకుడని కొనియాడారు. శాలిగౌరారం మండల కార్యదర్శిగా పనిచేస్తూ మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ పటిష్టత కోసం పనిచేశాడన్నారు. పార్టీకి కష్టకాలంలో వెన్నంటి ఉండి ఎర్రజెండా ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు నిరంతరం కృషి చేశాడని కొనియాడారు. చంద్రమౌళి ఆశయ సాధన కోసం కంకణబద్ధులై ముందుకు తీసుకపోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, డబ్బికార్ మల్లేష్, నారి ఐలయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, బొజ్జ చిన్న వెంకులు, జిట్టా నగేష్ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు చిన్న రాములు, జగన్, సిరిపంగి అంజి, ఎర్ర రమేష్, డెంకల లింగయ్య, అరవింద్, ఇస్మాయిల్, ప్రదీప్, అవనిజ పాల్గొన్నారు.

చంద్రమౌళి మృతిపట్ల సంతాపం
అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ సంతాపం

నల్లగొండ : సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడు, శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన మారోజు చంద్రమౌళి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ గురువారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం, పేదల సమస్యల పరిష్కారం జరిగిన పోరాటాల్లో చురుకైన పాత్ర పోషించిన మారోజుచంద్రమౌలి మరణం ప్రజలకు, పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. తనతోపాటు వ్యవసాయకార్మిక సంఘంలో పనిచేసి ఉద్యమాలకు నాయకత్వం వహించారని పేర్కొన్నారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు.

మారోజు చంద్రమౌళి మృతిపట్ల వ్యవసాయ సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్నవెంకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారి అయిలయ్య సంతాపం ప్రకటించారు. అదేవిధంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

అమరుల త్యాగాలు వృథా కావు

- సీపీఐ'(ఎం)జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి

నవతెలంగాణ- అర్వపల్లి

అమరుల త్యాగాలు ఎప్పటికీ వృథా కావని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం భవనం నిర్మాణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు .తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది మహనీయులు తుంగతుర్తి ప్రాంతంలో భూమి భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రాణాలు త్యాగం చేశారన్నారు. అణగారిన వర్గాలను చైతన్యపరిచి రజాకార్లకు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం గావించారన్నారు. అనేకమంది అసువులుబాసారని వారి త్యాగాలు ఎప్పుడు స్మరించడం కోసం ఎర్రజెండా కృషి



చేస్తుందని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని స్త్రీలకు రక్షణ లేకుండా పోయిందని ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయన్నారు. అంతకుముందు ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీ నరసయ్య యాదవ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి రావు, చెరుకు యాక లక్ష్మి ,పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, వజ్ర శ్రీను, ఉప్పలయ్య ,అబ్బులు, వెంకన్న, అవిలయ్య ,వినయ్ ,ఎల్లయ్య, యాదగిరి ,తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ ద్వారా అధిక లాభాలు గడించాలి

నవతెలంగాణ- తుంగతుర్తి

రైతులు ఆయిల్ ఫాం సాగు చేసి అధిక లాభాలు గడించాలని ఉద్యానవన శాఖ అధికారిణి స్రవంతి అన్నారు.గురువారం మండల కేంద్రంలోని నెమరు గొమ్ముల సురేందర్రావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటి అవగాహన కల్పించి మాట్లాడారు. ఎకరానికి 10 టన్నుల దిగుబడి వస్తుందని ,నాటిన నాలుగో సంవత్సరం నుండి పంట దిగుబడి ప్రారంభమవుతుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్పుకి ఎరువుల కి అంతర పంటలకి రాయితీ ఇస్తుందని,ఎస్సీ ,ఎస్టీలకు వందశాతం, బీసీ సన్న చిన్న కారు రైతులకు 90శాతం, ఇతర కేటగిరీల రైతులకు 80శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎరువులు, అంతర పంటల యాజమాన్యానికి ఎకరానికి 4200 చొప్పున మొదట నాలుగేండ్లపాటు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు సురేందర్రావు ,నిర్మల ,లాక్య నాయక్, డ్రిప్ ఇరిగేషన్ ప్రతినిధి సైదులు తదితరులు పాల్గొన్నారు.

చదువే మీ భవిష్యత్తుకు పెట్టుబడి

- డీఎస్పీ నాగభూషణం

నవతెలంగాణ-సూర్యాపేట



చదువే భవిష్యత్తుకు పెట్టుబడి అని ,కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఎస్పీ నాగభూషణం అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఫేర్వెల్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.¯కరీర్ లో ఇంటర్ మిడిల్ అని ఇంటర్ ఉత్తీర్ణులు అయితే మీ భవిష్యత్తుకు రాచబాట పడుతుందన్నారు.ఇంటర్ అనంతరం దోస్తులో మీరు కోరుకున్న కళాశాలలో సీటు రావాలంటే వారు కోరుకున్న విధంగా మీ మార్కులు ఉండాలని పేర్కొన్నారు. సెల్‌ఫోన్, సోషల్ మీడియా మెసేజ్ లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి జానపాటి కృష్ణయ్య కళాశాల ప్రిన్సిపాల్ పేరుమాండ్ల యాదయ్య, వార్డు కౌన్సిలర్ తాహెర్ పాష, వైస్ ప్రిన్సిపల్ మద్దిమడుగు సైదులు, అధ్యాపకులు లింగం, కవిత, కంది శ్రీను, బాల్తు శ్రీనివాస్, జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికురాలికి సన్మానం

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపల్ పరిధిలోని మాలిపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జి.ఆనంద భాస్కర్ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న వంట కార్మికురాలు పోతరాజు ముత్తమ్మను శాలువాతో సన్మానించి చీరను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రావు, చక్రు నాయక్, అంజయ్య, గుడిపాటి నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్‌ను తరలించొద్దని ఆర్.కృష్ణయ్యకు వినతి

నవతెలంగాణ -యాదగిరిగుట్ట



బస్టాండ్‌ను యాథావిధిగా కొనసాగించాలని కోరుతూ అన్ని రాజకీయ పార్టీల ప్రజాసంఘాల ఐక్యకార్యచరన కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు , రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్యను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 30 వేల మంది పట్టణ ప్రజల ప్రయాణ సౌకర్యంతో సంబంధం లేకుండా పట్టణ బస్టాండ్‌ను తరలించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తద్వారా వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి రోడ్ల పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. .ఇప్పటికే కొండపైకి ఆటోలు అనుమతించకపోవడం వల్ల 300మంది ఉపాధి లేక ఆటో కార్మికులు 340 రోజులుగా ఆందోళన చేస్తున్నారన్నారు. దేవాలయంలో స్థానికులకు ఇవ్వాల్సిన ఉద్యోగాలను స్థానిక నిరుద్యోగ యువతకు కాకుండా ఇతరులకు అక్రమంగా ఇచ్చారని తెలిపారు. బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ కాటబత్తిని ఆంజనేయులు, బీజేపి జిల్లా కోశాధికారి కాదురి అచ్చయ్యే, సీనియర్ నాయకులు రచ్చ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడ్ల నరేష్, బట్టు సతీష్ రాజ్, రంగ రేఖ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
2
శుక్రవారం 10 మార్చి 2023



హై స్కూల్‌ను సందర్శించిన స్టేట్ మానిటరింగ్ కమిటీ

నవతెలంగాణ-చిట్యాలటౌన్



చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం స్టేట్ మానిటరింగ్ కమిటీ సందర్శించారు. అనంతరం వనిపాకల, వట్టిమర్తి హై స్కూలను సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి అంచనా వేశారు. ఉపాధ్యాయుల తరగతిగది బోధనను పరిశీలించి విద్యలో నాణ్యతను పెంపొందించడానికి సూచనలను, సలహాలను ఇస్తూ విద్యార్థుల నుండి, ఉపాధ్యాయుల నుండి అభిప్రాయం తెలుసుకుని, ఉపాధ్యాయులకు బోధన సూచనలిచ్చారు. స్టేట్ టీం సభ్యులు నన్నూరి ఉపేందర్‌రెడ్డి, సువర్ణ వినాయక్, రాజేందర్‌రెడ్డి, చిట్యాల మండల నోడల్ ఆఫీసర్ సీహెచ్.నరసింగరావు ఉన్నారు.

శ్రీ శక్తి పురస్కారం అందజేత

నవతెలంగాణ-మిర్యాలగూడ




మండలం తుంగపాడు మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలు ఎన్వీ. కవిత సావిత్రిబాయి పూలే ఫౌండేషన్ జాతీయ శ్రీ శక్తి అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హై కోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందిని చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు గురువారం తెలిపారు. అవార్డు సాధించిన ఉపాధ్యాయురాలిని ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హడలెత్తిస్తున్న హార్ట్...

- నేల రాలుతున్న విద్యార్థులు, యువకులు
- కరోనా టీకానే కారణమా?

నవతెలంగాణ-నల్లగొండ

పదహారేండ్ల వయస్సులోనే గుండెపోటు, ఫ్రెండ్స్‌తో మాట్లాడుతూనే కుప్పకూలిన ఇంటర్ విద్యార్థి, ఖమ్మంలో విషాదకర ఘటన.. ఆస్పత్రికి తరలించేలోపే మతి. గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి రాకేశ్ మతి చెందాడు. రాకేశ్ తన ఇంటి ఆవరణలో స్నేహితులతో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు, స్నేహితులు రాకేశ్‌ను ఆస్పత్రికి తరలించేలోపు రాకేశ్ మతి చెందాడు. గుండెపోటుతోనే రాకేశ్ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. చిన్న, పెద్ద తేడా లేదు.. ధనిక, పేద అనే డిఫరెన్స్ లేదు..వయసుతో సంబంధమే లేదు. అందరినీ కాటేస్తోంది హార్ట్ ఎటాక్. కుర్రాళ్లు, యువకులు, ఆరోగ్యవంతులు ఎవరినీ వదలడం లేదు. ఉన్నటుండి సడెన్‌గా హార్ట్ ఎటాక్ వస్తుంది. అంతే, కుప్పకూలిపోతాడు. ఆ వెంటనే ప్రాణాలు కోల్పోతాడు. ఈ మధ్య కాలంలో దేశంలో గుండెపోటు మరణాలు గణనీయంగా పెరగడం ఆందోళనకు గురి చేసే అంశం. మేడ్చల్ సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలోనే విద్యార్థి విశాల్ గుండెపోటుతో మతి చెందడం తెలిసిందే. ఈ విషాదం మరువక ముందే మరో ఇంటర్ విద్యార్థి గుండెపోటుతో చనిపోయాడు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లిలో విషాదం చోటు చేసుకుంది. గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి రాకేశ్ మతి చెందాడు. రాకేశ్ తన ఇంటి ఆవరణలో స్నేహితులతో మాట్లాడుతున్నాడు. ఇంతలో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అప్రమత్తమైన కుటుంబసభ్యులు, స్నేహితులు రాకేశ్‌ను ఆస్పత్రికి తరలించేలోపు రాకేశ్ మతి చెందాడు. గుండెపోటుతోనే రాకేశ్ చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. దేశంలో గుండెపోటుతో చనిపోయే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. వయసుతో సంబంధం లేకుండా చిన్న వయసులోనే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఏదో ఒక పని చేస్తూ ఒక్కసారిగా కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలుతున్న ఘటనలు ఎక్కువ అవుతున్నాయి. వ్యాయామం చేస్తూ ఒకరు, డ్యాన్స్ చేస్తూ మరొకరు, కూర్చున్న వారు కూర్చున్నట్లే క్షణాల్లో ప్రాణాలు కోల్పోతుండటం ఆందోళన కలిగిస్తోంది. పట్టరాని ఆనందం వచ్చినా, భయాందోళనకు గురైనా గుండె కొట్టుకునే వేగం పెరగడం సర్వ సాధారణం. కానీ, ఏ కారణం లేకుండానే కొన్ని సెకన్ల పాటు గుండె వేగంగా కొట్టుకోవడం, తరుచూ అలా జరగడం గుండెపోటు లక్షణంగా చెబుతున్నారు డాక్టర్లు. కరోనా మహమ్మారి తర్వాత గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతోందన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ మరణాలకు కరోనాయే కారణం అని చెప్పే ఆధారాలేవీ లేవని వైద్య నిపుణులు చెబుతున్నారు. కోవిడ్ తర్వాత కొన్ని వారాల పాటు దాని ప్రభావం ఆరోగ్యంపై ఉంటుందని, కోవిడ్ -19 వల్ల శ్వాసకోశ వ్యాధులతో పాటు గుండెపోటు లాంటి ముప్పు కూడా పెరుగుతుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి.



గుండెపోటుకు చిన్న పెద్ద లేదు

దాక్టర్ పీ. శ్రీధర్ (ఎండీ, డీఎం, కార్డియాలజి సురక్ష హాస్పిటల్)



గుండెపోటుకు చిన్న పెద్ద లేదు. ఆధునిక జీవితంలో బిజీ లైఫ్ షెడ్యూల్, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా గుండెపోటు వేగంగా విస్తరిస్తోంది. గతంలో గుండె జబ్బులు వద్ధాప్య సమస్యగా పరిగణించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత కొన్ని సంవత్సరాలుగా యువకులు కూడా ఈ వ్యాధి బారిన పడుతున్నారు. గుండెకు రక్త ప్రసరణ ఆగినప్పుడు గుండెపోటు వస్తుంది. సాధారణంగా గుండె నాళాలలో కొవ్వు, ఇతర పదార్థాలు పేరుకుపోవడం వల్ల ఒక రకమైన అడ్డంకులు ఏర్పడతాయి. మనం ప్రతిరోజూ తెలిసి తెలియక కొన్ని పనులు చేస్తుంటాం. దాని వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని గురించి ప్రజలందరూ తెలుసుకోవడం, నివారించడం ముఖ్యం. మన అలవాట్లను మెరుగుపరచుకోవడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

కరోనా టీకా వల్ల గుండెపోటు రాదు

దాక్టర్ కొండలరావు (డీఎంహెచ్ఓ, నల్లగొండ)



కరోనా టీకా వల్ల గుండెపోటు వస్తుంది అనడం అబద్ధం. ఊబకాయం వల్ల అధిక కొలెస్ట్రాల్, అధిక ట్రైగ్లిజరైడ్, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇవన్నీ గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్నాయి. బరువును సకాలంలో అదుపులో ఉంచుకుంటే ఈ సమస్యలన్నింటిని పరిష్కరించవచ్చు. ధూమపానం చేసేవారు, అధిక ఒత్తిడికి లోనయ్యే వ్యక్తులకు గుండెపోటు ప్రమాదం ఎక్కువగా ఉంటుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిజానికి, ధూమపానం వల్ల ధమనులలో ఒక రకమైన పదార్థం అడ్డుగా ఏర్పడుతుంది. దీని వల్ల ధమనులు సంకుచితమై గుండెకు రక్త ప్రసరణ తగ్గుతుంది. ఇది గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతుంది. ఏ పనిచేయకుండా ఉన్నప్పుడు ధమనులలో కొవ్వు పదార్థాలు పేరుకుపోతాయి. మీ గుండెకు రక్తాన్ని చేరవేసే ధమనులు దెబ్బతిన్నట్లయితే అది గుండెపోటుకు దారి తీస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

'మోటార్ సైకిల్స్ వెంటనే ఇవ్వాలి'

నవతెలంగాణ-నల్లగొండ



భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మోటార్ సైకిల్స్ ఇస్తానన్న హామీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగూరి రాములు డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షులు కంచి కేశవులు అధ్యక్షతన జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వెల్ఫేర్ బోర్డు కార్డు ఉన్న కార్మికులందరికీ మోటార్ సైకిల్ ఇస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. మే1న మోటార్ సైకిల్ ఇస్తామని కార్మిక శాఖ మంత్రి కూడా ప్రకటించారు. 10 నెలలు గడిచిన నేటికి ఎలాంటి వీధి విధానాలురూపొందించలేదని వెంటనే మోటార్ సైకిల్స్ ఇవ్వాలని కోరారు. తెలంగాణ భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో 3700 కోట్లు మూలుగుతున్న పెండింగ్ క్లెయిమ్స్ ని క్లియర్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 54 వేల క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం కార్మికుల పేర్లు నమోదు చేయాలని, గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించాలని కోరారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24న జరిగే ఏఎల్ఓ ఆఫీస్‌లో నిర్వహించే ధర్నాలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు అద్దంకి నరసింహ, బీ.సైదులు, బైరం దయానంద్, జిల్లా సహాయ కార్యదర్శి వడ్డేపల్లి శంకర్ జిల్లా నాయకులు వెంకటయ్య, శ్రీకాంత్, జె.సైదులు, ఇంజమూరి శివకృష్ణ, సీహెచ్ సైదులు, ఇన్నయ్య, కాశమ్మ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లను పూర్తి చేయాలి

- సెల్ ఫోన్‌లకు అనుమతి లేదు
- అదనపు కలెక్టర్ భాస్కరరావు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్



ఏప్రిల్ 3 వ తేదీ నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అత్యంత జాగరూకతతో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందన్నారు. పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఏప్రిల్ 3 నుండి 13 వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించే పదవ తరగతి పరీక్షలకు 19,414 మంది విద్యార్థులు హాజరు కానున్నారని ఇందుకోసం 107 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఈఓ బిక్షపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ముజీ బుద్దిన్, పోలీస్, విద్యుత్ పోస్టల్, ఆర్‌టీసీ, మున్సిపల్ కమిషనర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-దేవరకొండ

హోటల్ అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని తెలంగాణ రాష్ట్ర హోటల్ అసంఘటిత కార్మికుల సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హోటల్ కార్మికుల భవనం నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అసంఘటిత కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా అన్నారు. అనంతరం యూనియన్ కార్డులను ఎమ్మెల్యే కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్



ఎంపీపీ చింతపల్లి సుభాష్, రాష్ట్ర నాయకులు హనుమంతు వెంకటేష్ గౌడ్, సంఘ. రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎర్ర రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు తిరుమల దుర్గేష్, కుంభం శ్రీశైలంగౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- కమిషనర్ కేవీ.రమణచారి

నవతెలంగాణ-నల్లగొండ



నల్లగొండ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కేవీ.రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ పట్టణంలోని పలు కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ రోడ్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, అవసరమైతే కూలీల సంఖ్యను పెంచైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా గొల్లగూడ సమీపంలో గల పెద్ద బండ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని, అవుట్‌డోర్ స్టేడియం వద్ద చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులను, హైదరాబాద్ రోడ్‌లో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మించిన నిరాశ్రయుల భవనం చుట్టూ చెట్లను పెంచాలని, బార్డర్లకు పెయింటింగ్, టైల్స్ వేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈలు అశోక్, నర్సింహారెడ్డి, ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మూర్తుజ, శంకర్, శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికున్ని ఆదుకోవాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మండలంలోని యాదగిరిపల్లి గ్రామంలో గురువారం నక్క జానయ్య అనే గీత కార్మికుడు(43) తాటి చెట్టు మీద నుండి జారి పడ్డాడు. గాయాల పాలైన జానయ్యను చికిత్స నిమిత్తం ఏరియా హాస్పిటల్ తరలించగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు పరామర్శించి మాట్లాడారు. గీత వృత్తి ప్రాణాపాయంతో కూడుకున్నదని, ఉపాధి కోసం కార్మికులు అనేక ఇబ్బందులు పడుతూ జీవనం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాధితున్ని ప్రభుత్వం ఆదుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆకిటి రామస్వామి, గువ్వల అంజయ్య, మల్లెబోయిన మట్టయ్య రమేష్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.



జెర్సీల పంపిణీ

నవతెలంగాణ-నకిరేకల్

బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా హ్యాండ్ బాల్ జట్టు క్రీడాకారులకు గురువారం మండలంలోని మంగళపల్లి గ్రామంలో జెర్సీలను ఎంపీపీ బచుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 10 నుండి నిజామాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయిలో నల్లగొండ జిల్లా పేరును నిలబెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఈటీ పుల్లయ్య, ఉపసర్పంచ్ శ్రీను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, బచుపల్లి రామలింగారావు, అధ్యాపక బృందం, బీజీఆర్ సైన్యం ప్రతినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తు తేదీ పొడగింపు

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

నేషనల్ యూత్ వాలంటీర్స్ ఎంపిక కోసం ఈనెల 24వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రవీణ్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యువజన సంఘాల స్థాపన, పారిశుద్యం, పరిశుభ్రత, క్రీడలు, ఆరోగ్యం, సామాజిక సేవ, ఇతర అంశాలపై యువతను చైతన్య పరిచిన 18 నుండి 29 సంవత్సరాల మధ్య వయసు కలిగిన యువతి, యువకులు నేషనల్ యూత్ వాలంటీర్లుగా www.nyks.nic.in వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



క్రీడలను ప్రారంభించిన ఎస్సై

నవతెలంగాణ-చిట్యాలటౌన్

చిట్యాల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను స్థానిక ఎస్సై ఎన్.ధర్మ ప్రారంభించి మాట్లాడారు. ఆటలు విద్యార్థుల మనోఉల్లాసానికి ,శారీర దారుడ్యానికి దోదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కే. శ్రీధర్, ప్రిన్సిపల్ బీ.యాదగిరి గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ పోటీలకు ఎంజీయూ అధ్యాపకుడు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

లక్నోలో జరగనున్న ఐదవ జాతీయ ప్యారా బ్యాడ్మింటన్ పోటీలకు తెలంగాణ రాష్ట్ర జట్టులో మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, బయో కెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న పల్లా మురళి ఎంపికైనట్లు తెలంగాణ ప్యారా బ్యాడ్మింటన్ అసోసియేషన్ వారు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వికలాంగుడైన మురళి బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరచడం ద్వారా గతంలో ఎన్నో బహుమతులను గెలుచుకున్నారు. గత ఏడాది అస్సాంలో జరిగిన పోటీల్లో ఓటమిపాలైనప్పటికీ మరల ప్రయత్నించి ఈసారి మరలా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. తమ అధ్యాపకుడు అవరోధాలను అధిగమించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమని అధ్యాపకులు మిత్రులు ప్రశంసించారు.

పారిశుధ్యంతో.. ప్రజా ఆరోగ్యం

- ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



ప్రతి ఒక్కరు మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ప్రజారోగ్యం బాగుపడుతుందని మండల పరిషత్ అధ్యక్షులు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో జిల్లా స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ నల్లగొండ వారి ఆధ్వర్యంలో సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బంది, మహిళా సమాఖ్య సిబ్బందికి ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంతోనే ప్రజా ఆరోగ్యం ముడిపడి ఉందని, ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నీటి వినియోగం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ప్రతి ఇంట్లో తడి పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ టా క్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించేందుకు సహకరించడం చేసినప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండి ఆర్థికంగా బలోపేతం కావచ్చు అన్నారు.

ప్రజల సహకారంతో గ్రామ పారిశుద్ధ ప్రణాళిక

జిల్లా కోఆర్డినేటర్ జీ.శంకర్‌బాబు

ప్రతి గ్రామంలో ప్రజల సహకారంతో గ్రామ పారిశుద్ధ్య ప్రణాళిక సిద్ధం చేసి, ఓడీఎఫ్ నుండి ఓడీఎఫ్ ప్లస్ ఎదిగేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ జీ.శంకర్‌బాబు పేర్కొన్నారు. మొదటి రోజు ఓడీఎఫ్ నుండి ఓడిఎఫ్ ప్లస్, ఓడిఎఫ్ సుస్థిరత ,ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్వహణ మీద ఆయన శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్ నరసింహాచారి వాడిన నీటి నిర్వహణ మీద శిక్షణ ఇచ్చారు. రెండవ రోజు మండల పరిధిలోని గ్రామంలో ఏనుగుల దోరి గ్రామపంచాయతీ సందర్శించి సర్వే నిర్వహించడం, గ్రామ పారిశుధ్య ప్రణాళిక తయారు చేయడం జరుగుతుందనీ పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ మోహినిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో యాదగిరిగౌడ్, ఎంపీఓ, సత్యనారాయణ, ఏపీ ఎం.శ్రీనివాస్, ఏపీవో యాదయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్ ,ఫీల్డ్ అసిస్టెంట్లు, వీవోఏలు పాల్గొన్నారు.

సైనిక్ ప్రవేశాల్లో విద్యార్థుల సత్తా

నవతెలంగాణ-మిర్యాలగూడ

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు గురువారం విడుదల అయ్యాయి. ఈ ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని మాస్టర్ మైండ్ కోచింగ్ సెంటర్కి చెందిన 7గురు విద్యార్థులు అధిక మార్కులు సాధించి సీట్లు సాధించినట్లు సంస్థ నిర్వాహకుడు సుద్దుల సైదులు తెలిపారు. ఫలితాలలో బీసీ కేటగిరిలో యశ్వంత్ రాష్ట్ర స్థాయి లో 11వ, శ్రవణ్ 13 వ, కె. సిద్దు 31వ ర్యాంకులు సాధించగా, ఎస్టీ విభాగంలో అశోక్ రాష్ట్ర స్థాయి లో 7వ ర్యాంకు, యమ్. దత్తు 12వ, టి. సాత్విక్ 31 వ ర్యాంకులు ఎస్సి విభాగంలో సాత్విక్ 36 వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులు విజయకేతనం ప్రదర్శించారు.

12న ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ పరిధిలోని విద్యా సంవత్సరం 2023-24 లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 12వ తేదీన ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 వరకు నల్లగొండ ఉమ్మడి జిల్లాలో నాలుగు సెంటర్లలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు గిరిజన గురుకులాల ఆర్సీఓ కే. లక్ష్మయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవరకొండలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, వాటితోపాటు మహిళా డిగ్రీ కళాశాలలో కూడా పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తుంగతుర్తి బాలికల గిరిజన సంక్షేమ పాఠశాలలో కూడా ఒక పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా రావాలని హాల్ టికెట్, ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డులతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9966669894 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

నిర్ణీత గడువులోగా రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ శ్రామిక్

నవతెలంగాణ-మిర్యాలగూడ

నల్లగొండ జిల్లాలో నిర్ణీత ప్రభుత్వ పథకాలు, రుణాలను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని నల్లగొండ జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మిర్యాలగూడ నియోజకవర్గ స్థాయి సంయుక్త బ్యాంకర్ల, అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రుణ పథకాలు, స్వయం సహాయక సంఘాలు, సంఘబంధాలకు వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి పథకాలు సత్వరం పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో రుణ లక్ష్యంలో 80 శాతమే పూర్తయ్యిందని, 20శాతం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాబార్డు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వినయ్ కుమార్, ఎంపీఓ వీరారెడ్డి, మెప్మా కో ఆర్డినేటర్ శివాజీ, ఐకేపీ ఏపీఎంలు కృష్ణమూర్తి, శేషయ్యలు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీ ఉపకులపతికి అభినందనలు



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమింపబడిన ఆచార్య విద్యుల్లతని గురువారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సహచర అధ్యాపకురాలు ఆచార్య విద్యుల్లత ప్రతిష్టాత్మకమైన మహిళ విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా నియమింపబడటం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య రాథోడ్, ఎంజీయూ ఓఎస్డీ ఆచార్య అలువాల రవి పాల్గొన్నారు.

స్వపరిపాలనా దినోత్సవం

నవతెలంగాణ-తిరుమలగిరి



మండలంలోని తొండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం నిర్వహించారు. శాసన సభ్యులుగా దివ్య , జిల్లా కలెక్టర్‌గా సహస్ర , జిల్లా విద్యాధికారిగా సరిత, మండల విద్యాధికారిగా రమాజ్యోతి , ప్రధానోపాధ్యాయులుగా నిహారిక వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె . అశోక్ రెడ్డి , ఉపాధ్యాయులు మురళి , మల్లిఖార్జున్ , అనితా కుమారి , జానిబేగం విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం

కోదాడరూరల్:నేడు మండల పరిధిలోని ఎర్రవరం గ్రామంలో స్వయంబుగా వెలసిన బాల ఉగ్ర నరసింహ స్వామి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దేవాలయ చైర్మెన్ నలజాల జగన్నాథం గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తెల్లవారుజామున ఉదయాన్నే శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని, కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, మంత్రులు, ఎంపీపీలు ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ హాజరవుతున్నట్లు తెలియజేశారు. గ్రామంలో ఉదయం పదిగంటల నుండి జరిగే అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. 11వ తేదీన చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శంకుస్థాపనకు మంత్రి జగదీశ్‌రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాండు

నవతెలంగాణ-హుజూర్ నగర్‌టౌన్



సీఐటీయూ కార్యాలయ ఆస్తి అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని, సదరు ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై, సహకరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం), సీఐటీయూ, ఏఐకేఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్యాలయ ఆస్తిని ఏవిధంగా రోశపతి బంధువు వెంకన్నకి అసైన్మెంట్ ఇచ్చారని కమిషనర్‌ను నిలదీశారు. అంతేగాక ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనకు క్రింది స్థాయి సిబ్బంది తప్పుడు సమాచారం ఇచ్చారని వారిపై శాఖపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు కూడా పెడతామని హామీ ఇచ్చారు. తనకు తప్పుడు సమాచారం ఇచ్చిన కిందిస్థాయి సిబ్బంది పేర్లు ప్రకటించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నత అధికారులకు తెలియజేశామని తెలిపారు. అనంతరం సీఐటీయూ కార్యాలయ ఆస్తిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పులిచింతల వెంకటరెడ్డి, కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి, జిల్లా కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, వట్టెపు సైదులు, మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి ఎలక సోమయ్యగౌడ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మ కొమ్ము, యోనా, రేపాకుల మురళి, సీనియర్ నాయకులు పాశంవెంకట్ నారాయణ, పిట్టలనాగేశ్వరరావు, శీలం సాంబయ్య చింతకుంట్ల వీరయ్య రేపాకుల వెంకన్న, అభిమల్ల జనార్ధన్, రేపాకుల వీరస్వామి, పాశం వీరబాబు, పిన్నపరెడ్డి వెంకటరెడ్డి, నక్కినబోయిన శంబయ్య, షేక్, అహ్మద్, వెంకన్న, దుగ్గిసాయి, గుండు సైదులు, చింతకాయల శ్రీను, ములకలపల్లి శీను ,వీర నాగేశ్వరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మగవలేనిది మనుగడ లేదు

- సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్

నవతెలంగాణ-హుజూర్‌నగర్



సృష్టికి మూలం స్త్రీ అని, స్త్రీ లేనిదే సృష్టి లేదని సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక న్యాయస్థానంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి మగాడి విజయం వెనక ఒక స్త్రీ ఉంటుందనేది ముమ్మాటికి వాస్తవమన్నారు. బాలికల సంరక్షణ కోసం భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 15 ప్రకారం అనేక రకాల చట్టాలు చేయబడ్డాయని, ఈ చట్టాల ద్వారా మహిళలను ఎవరైనా ఇబ్బంది పెట్టిన వేధించిన కఠిన శిక్షలకు గురికాక తప్పదని హెచ్చరించారు. జూనియర్ సివిల్ జడ్జి సాకేత మిత్ర మాట్లాడుతూ అనాది కాలం నుండి స్త్రీలను స్త్రీ దేవతల మూర్తులను పూజించే ఏకైక దేశం భారతదేశం అన్నారు. లింగ వివక్షతకు ఎవరైనా పాల్పడి గర్భస్రావం చేస్తే కఠిన శిక్షలకు గురికాక తప్పదని హెచ్చరించారు. నేడు మహిళలు మారుతున్న పరిస్థితులలో అన్ని రంగాలలో తమ ప్రతిభాపాటవాలను చూపుతూ ముందుంటున్నారని మునుముందు కూడా ఇదే స్ఫూర్తిని మహిళలు కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ విజయలక్ష్మిని, మహిళ న్యాయవాదులు సుంకరి ప్రదీప్తి, పార్థబోయిన మౌనికలను న్యాయమూర్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, ఎస్సై వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల నాగేశ్వరరావు, అధికార ప్రతినిధి కాలువ శ్రీనివాసరావు, ఏజీపీ ముప్పాళ్ళ గోపాల కృష్ణమూర్తి, న్యాయవాదులు చనగాని యాదగిరి, రవికుమార్, కృష్ణయ్య, మీసాల అంజయ్య, రాఘవరావు, కొట్టు సురేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలి

- ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్

నవతెలంగాణ- సూర్యాపేట కలెక్టరేట్

విద్యార్థులు సీపీఆర్ పై అవగాహన కలిగి ఉండాలని గాయత్రి నర్సింగ్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి త్రివేణి డిగ్రీ,పీజీ కళాశాలలో గాయత్రి నర్సింగ్ హోమ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి అకస్మాత్తుగా గుండెపోటుకు గురైనప్పుడు 6 నిమిషాల లోపల ఆక్సిజన్‌ను మెదడుకు చేరవేయడం కోసం సీపీఆర్ ను30 సార్లు చేయాలన్నారు. కోవిడ్ వచ్చిన తర్వాత ప్రజలలో ఆరోగ్య సమస్యలు ఎక్కువయ్యాయని, క్రమం తప్పకుండా వ్యాయామం చేసి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. అనంతరం నమూనాగా సిపిఆర్ చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పెసర జనార్దన్ రెడ్డి, ప్రిన్సిపల్ తన్నీరు ఉపేందర్, డాక్టర్ రమేష్ నాయక్, విద్యార్థి టీసీ



సంఘం జిల్లా అధ్యక్షులు వీరబోయిన లింగయ్య యాదవ్, చల్లా రామారావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ధర్నాను జయప్రదం చేయండి

నవతెలంగాణ-మునగాల



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక విధానాలను వ్యతిరేకంగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే దర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో సీఐటీయు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల, మండల సంయుక్త విస్తృత స్థాయి సమావేశం రైతు సంఘం మండల అధ్యక్షులు చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తుందని విమర్శించారు. కార్మిక రైతు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న ఢిల్లీ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ బచ్చలకూర స్వరాజ్యం, కౌలు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎస్‌కే.సైదా, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆరెరామ కృష్ణారెడ్డి, సోమపంగి, జానయ్య, కేవీపీఎస్ నాయకులు నందిగామ సైదులు, మల్లారెడ్డి రామకృష్ణారెడ్డి, నాగరాజు, కిన్నెర వెంకన్న, పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించడమే మనఊరు-మనబడి లక్ష్యం



నవతెలంగాణ -తుంగతుర్తి

నాణ్యమైన విద్యను అందించడం,విద్యార్థులు హాజరు శాతాన్ని మెరుగుపరచడం,పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకోసం మనఊరు-మనబడి పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మనఊరు-మనబడి పథకం ద్వారా మంజూరైన 34 లక్షలతో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అధునాతన వసతుల పాఠశాలలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నకిరేకంటి విజయ్, మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య,జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్,ఎస్ఎంసి చైర్మన్ బుద్ధ అంజయ్య,గొట్టిపర్తి ఎంపీటీసీ కేతిరెడ్డి లతా విజయకుమార్ రెడ్డి,గ్రామ పార్టీ అధ్యక్షులు వగలగాని లింగయ్య,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హస్రా పర్వీన్,తదితరులు పాల్గొన్నారు.



కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని గణేష్ నగర్‌లో శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో సుమన్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకి కరాటే బెల్ట్‌లు, సర్టిఫికెట్లను మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంత విద్యార్థులకు కరాటేలో ఉత్తమ శిక్షణ ఇస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విజేతలుగా నిలుపుతున్న సుమన్ షోటోకాన్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షులు కొండపల్లి క్రాంతికుమార్ అభినందనీయులన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మనోధైర్యం కల్పించే మార్షల్ ఆర్ట్స్ క్రీడలు నేర్చుకోవాలన్నారు. కరాటే శిక్షణ కోదాడలోకి అందుబాటులోకి తెచ్చిన కరాటే మాస్టర్ క్రాంతి కుమార్‌ను అభినందనలు తెలిపారు. అనంతరం కరాటే మాస్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ కరాటే ఆత్మ రక్షణకు, ఆత్మ విశ్వాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు క్రీడాకారులు జే.నవీన్ కుమార్, జీ.రవికుమార్, టీ.రమేష్, జీ.మురళి తదితరులు పాల్గొన్నారు.

'లింగయ్య మృతి బాధాకరం'



నవతెలంగాణ-పెన్‌పహాడ్

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు లింగయ్య మృతి బాధాకరమని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఖమ్మంపాటి లింగయ్య బుధవారం అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం ఆయన అంతిమయాత్ర గ్రామంలో కొనసాగగా ఎంపీపీ నెమ్మాది బిక్షం, బీఆర్ఎస్ జిల్లా నాయకులు అంజయ్య, మండల పార్టీ అధ్యక్షులు దొంగరి యుగేందర్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మిర్యాల వెంకటేశ్వర్లు పాల్గొని మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొనే వాడని ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలలో ముందంజలో ఉండి పలుసార్లు పార్టీ విజయం కోసం కృషి చేశారన్నారు. లింగయ్య కుటుంబానికి పార్టీ అండదండలు ఎల్లవేళలా ఉంటాయని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ అంతిమయాత్రలో సర్పంచ్ షేక్ షరీఫుద్దీన్, జిల్లా నాయకులు తూముల ఇంద్రసేనారావు, వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, బిట్టు నాగేశ్వరరావు, చెన్ను శ్రీనివాసరెడ్డి, గుగ్గిళ్ళ సోమయ్య, పొదిల నాగార్జున, యగ్గడి మురళి, మల్లయ్య, పేర్ల శ్రీధర్, జూలకంటి వెంకటరెడ్డి ,రామచంద్రారెడ్డి, మైసయ్య, పాండురంగయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయండి

నవతెలంగాణ -తుంగతుర్తి



పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి సమిష్టిగా కృషి చేయాలని తహసీల్దార్ రాంప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల భవిష్యత్తుకు పదవ తరగతి పునాది అని ,ఉద్యోగ బాధ్యతను కర్తవ్యాన్ని మరవద్దన్నారు. అంతకు ముందు మండలవిద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని స్టడీ అవర్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు యూనిఫామ్ కాకుండా కలర్ డ్రెస్సులు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జగ్గు నాయక్ ,ఎంపీడీవో భీమ్ సింగ్ నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొండగడుపుల యాకయ్య, గురువయ్య గిరిజన సంక్షేమ కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాభవాని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల వైస్ ప్రిన్సిపాల్ హసీనా మండలంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు
హుజూర్ నగర్
OS NO.13 /2019
IN
IA NO.63/2019

మధ్య:-
ఏలూరి మంగారెడ్డి తండ్రి అప్పిరెడ్డి వయస్సు 58 సంవత్సరాలు చౌటపల్లి గ్రామం మఠంపల్లి మండలం సూర్యాపేట జిల్లా.
....వాది
మరియు
కొంకాయల వెంకటరెడ్డి హైదరాబాద్
..... ప్రతివాది

టూ,
కొంకాయల వెంకటరెడ్డి తండ్రి ఆదిరెడ్డి వయసు 32 సంవత్సరాలు మాధవ రెడ్డినగర్ రఘునాథపాలెం గ్రామం మఠంపల్లి మండలం సూర్యాపేట జిల్లా ప్రస్తుత నివాసం H.No.5-9-658 gun-Foundri హైదరాబాద్.

ఇందుమూలంగా టు అడ్రస్ లోని మీకు తెలియజేయునది ఏమనగా వాది అయిన ఏలూరి మంగారెడ్డికి రూ 3,40,000 ఇవ్వవలసి ఉన్నదని పై కోర్టు నందు దావా వేసి ఉన్నారు సదరు దావాలో టు అడ్రస్‌లోని మీకు ఎన్నిసార్లు సమన్లు,నోటీసులు పంపినప్పటికీ టు అడ్రస్ లోని మీరు లేరని వాపసు వస్తునందున సదరు కోర్టు వారు తేదీ 16-3- 2023 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా వేసియున్నారు.కావున టు అడ్రస్ లోని మీరు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని హాజరు కాగలరని లేని పక్షంలో మీ పరోక్షమున ఏకపక్ష నిర్ణయం చేసి వాదికి అనుకూలముగా ఆర్డర్ ఇవ్వగలరని టు అడ్రస్ లోని మీకు తెలియజేయనైనది.

(కోర్టు వారి అనుమతితో)

జక్కుల నాగేశ్వరరావు
మునగపాటి గోపీనాథ్
పసుపులేటి వీరయ్య
వాది తరపు న్యాయవాదులు
సెల్:9866499007



డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తా

- మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని 18 వ వార్డులో నెలకొని ఉన్న డ్రెయినేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం పట్టణంలోని 18వ వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రెయినేజీ సమస్యలు, పరిసరాల అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అనారోగ్యాల గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వెంటనే స్పందించి డ్రయినేజీతో పాటు పరిసరాల అపరిశుభ్రత సమస్యలను పరిష్కరిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వనపర్తి లక్ష్మీనారా యణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట రూరల్:రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ, బీరవోలు రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ జీడీ బిక్షం అన్నారు. గురువారం మండల పరిధిలోని పులగం వారి గూడెంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు



ప్రారంభించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్కరికి ప్రతి గ్రామంలో ఉచిత వైద్యం అందించాలనే సంకల్పంతో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ నాయుడ్కు, గ్రామ సర్పంచ్ పులగం స్వాతి రాఘవరెడ్డి ,వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ,క్యాంపు మెడికల్ అధికారి డాక్టర్ విజయ, సూపర్వైజర్లు ఫయాజ్, రాజకుమార్ ,ఉప సర్పంచ్ తొట్ల నాగరాజు ,కార్యదర్శి ఉమా, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ,అంగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పట్టణంలోని 8వ వార్డులో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం స్థానిక కౌన్సిలర్ శాగంటి అనసూయ రాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ మల్లెల వందన , సిహెచ్ఓ మలోతు బిచ్చు నాయక్, ఎమ్ ఎల్ హెచ్ పి ప్రవలిక, సంధ్యారాణి,పూర్ణ శేఖర్, విజయ్, దనమ్మ ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

నవతెలంగాణ- చివ్వేంల

అన్నదానం మహాదానమని మేడి ఫౌండేషన్ నిర్వాహకులు మేడి ముత్తయ్య నరసమ్మ అన్నారు. గురువారం దురాజ్ పల్లిలోని ఆలేటి ఆటం వరల్డ్ అనాథాశ్రమంలో ఆత్మకూర్ (ఎస్) పీఏసీఎస్ చైర్మెన్ కొనతం సత్యనారాయణ రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేసి కేక్ కట్ చేశారు .ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గిలకత్తుల జానకమ్మ రాములు, కనపర్తి మహేష్, వెంకన్న, కోడూరు మల్లికార్జున్ ,గుండు జగదీష్, గిలకత్తుల ఈశ్వర్, అబ్బు గాని మహేష్ ,ములకలపల్లి వెంకటమ్మ, వేణు, బింగి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విప్ సునీతకు జర్నలిస్టుల సన్మానం

నవ తెలంగాణ- ఆలేరుటౌన్



రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డినిగురువారం ప్రింట్ అండ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు.పూలబోకే అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.వెంకటేశ్వరరావు, తోట మల్లయ్య, పి.మాధవరెడ్డి, యేలుగల కుమారస్వామి,ఎర్ర జాన్సన్, మంచన మల్లేశం, బైరి విశ్వనాథం, కొరుటూరు ఉపేందర్, సిహెచ్ .వెంకటేష్, గుండు మధు, మహేందర్,దూడల సాగర్,జహంగీర్,భాను, నరేష్, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ -వలిగొండరూరల్



మండల పరిధిలోని సుంకిశాల గ్రామానికి చెందిన కోమల్ల నరేష్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబాన్ని గురువారం మాజీ సర్పంచ్ పైళ్ల సంధ్యారాణి,ఉపేందర్ రెడ్డి పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకులు కొండే కిష్టయ్య, పోలేపల్లి స్వామి,కాటపల్లి పాండు,మంగ బాలయ్య,మంగ పాండు,తదితరులు పాల్గొన్నారు.

రూ.19.45 కోట్లతో మోత్కూర్ మున్సిపల్ బడ్జెట్

- గతేడాది కంటే రూ.1.50 కోట్లు తగ్గిన బడ్జెట్
- అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి
- తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్ కుమార్

నవతెలంగాణ-మోత్కూరు

మున్సిపాలిటీలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని, మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యమని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మోత్కూరు మున్సిపాలిటీ 2023-24 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రోడ్డు వెడల్పు లో భాగంగా విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు చేయాలని విద్యుత్ ఏఈని ఎమ్మెల్యే ఆదేశించారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టాల్సిన పనులపై పబ్లిక్ హెల్త్ ఎస్ఈ, ఆర్అండ్ బీ డీఈ, ఇరిగేషన్ ఏఈలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మున్సిపల్ పాలకవర్గానికి ఎమ్మెల్యే ఐడెంటీకార్డులు అందజేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కారుపోతుల శిరీష, లెంకల సుజాత, ఎర్రవెల్లి యాదమ్మ, మలిపెద్ది రజిత, వనం స్వామి, దబ్బెటి విజయ, బొడ్డుపల్లి కల్యాణ్ చక్రవర్తి, గుర్రం కవిత, కూరెళ్ల కుమారస్వామి, కోఆప్షన్ మెంబర్లు గనగానినర్సింహ, పోలినేని ఆనందమ్మ, ఎండి.షాహిన్ సుల్తాన, మున్సిపల్ కమీషనర్ సి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రూ.19.45 కోట్లతో మున్సిపల్ బడ్జెట్

మోత్కూరు మున్సిపాలిటీ 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ రూ.19 కోట్ల 45లక్షల 38 వేలతో బడ్జెట్ ప్రవేశపెట్టగా ఖర్చు అంతే ఉంటుందని అంచనా వేశారు. మున్సిపాలిటీకి ఆదాయంగా పన్నుల ద్వారా రూ.1.40 కోట్లు, రెంట్ల ద్వారా రూ.19.18 లక్షలు, పారిశుధ్య విభాగం నుంచి రూ.14లక్షలు, టౌన్ ప్లానింగ్ ద్వారా రూ.72లక్షలు, ఇంజనీరింగ్ విభాంగం నుంచి రూ. 64.50లక్షలు, డిపాజిట్, రుణాల ద్వారా రూ.10లక్షలు, ప్రణాళికేతర నిధులు రూ.1.88 కోట్లు, ప్రణాళికా నిధులు రూ.62లక్షలు, ఇతర నిధులు రూ.13.75 కోట్లు, మొత్తం రూ.19కోట్ల 45క్షల నిధులు వచ్చే అవకాశమున్నట్టు అంచనా వేశారు. ఖర్చుల కింద సిబ్బంది వేతనాలు రూ.1.49 కోట్లు, పారిశుధ్యనిర్వహణకు రూ.52.20లక్షలు, కరెంట్ బిల్లుల చెల్లింపుకు రూ.కోటి, హరితహారంకు రూ. 30.97లక్షలు, నిర్వహణ ఖర్చు రూ.52.20లక్షలు, పరిపాలనా ఖర్చు రూ. 33.84 లక్షలు, టౌన్ ప్లానింగ్ ఖర్చు రూ.50లక్షలు, అభివృద్ధి చెందని ప్రాంతాల అభివృద్ధి కోసం రూ. 4.88లక్షలు, ప్రజా సౌకర్యాల కల్పనకు రూ.5 లక్షలు, వార్డుల వారీగా ఖర్చు రూ.4.76లక్షలు, డిపాజిట్, లోన్స్ రూ.10లక్షలు, ప్రణాళికేతర నిధులు రూ. 1.88కోట్లు, ప్రణాళికా నిధులు రూ. 62 లక్షలు, ఇతర నిధుల కింద రూ.13.75 కోట్లు ఖర్చు చేయనున్నట్టు పేర్కొన్నారు. రూ.19.45 కోట్ల ఆదాయ, వ్యయాలతో ప్రవేశపెట్టిన బడ్జెట్ కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కాగా గత సంవత్సరం రూ.21.06 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.1.50 కోట్ల మేర తగ్గింది.

మరణించినా...కుటుంబాన్ని ఆదుకున్నాడు

నవతెలంగాణ -యాదగిరిగుట్ట



ఇంటికి పెద్ద దిక్కుగా ఉండి కుటుంబాన్ని నడిపించాల్సిన వ్యక్తి ఆకస్మికంగా మరణించడంతో ఆ కుటుంబం మొత్తం అంధకారంలోకి వెళ్లిపోతుంది.. కానీ.అదే వ్యక్తి ముందు చూపుతో వ్యవహరించిన తీరు ఆ కుటుంబానికి అండగా ఉండేలా చేసింది.వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా మేడిపల్లికి చెందిన గుణగంటి శ్రీకాంత్ యాదగిరి గుట్ట యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ నుండి 16 లక్షల గృహ రుణాన్ని పొందాడు. దాంతోపాటు 33 వేల ప్రీమియం చెల్లించి స్టార్ యూనియన్ డై లైఫ్ (ఎస్ యు డి)సంపూర్ణ లోన్ సురక్ష పాలసి కూడా తీసుకున్నారు. పాలసీ తీసుకున్న శ్రీకాంత్ కొద్దిరోజుల క్రితం సహజ మరణం పొందారు. బ్యాంక్ అధికారులు కొద్ది నెలలుగా నెలవారి వాయిదాలు కట్టకపోవడంతో మృతుని కుటుంబానికి ఫోన్ చేశారు. పాలసీదారు శ్రీకాంత్ చనిపోయాడని ఆ కుటుంబ సభ్యులు తెలపడంతో వెంటనే ఎస్‌యుడి లైఫ్ టీం శ్రీకాంత్ కుటుంబానికి సంప్రదించి ఇంటికి సంబంధించిన మొత్తం గృహ రుణం 16 లక్షలను 30 రోజుల్లో సెటిల్ చేసి మృతుని భార్య గుణగంటి మౌనికకు మాఫికి సంబంధించిన ఒప్పంద పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు మృతుని కుటుంబం ధన్యవాదాలు తెలిపింది. మృతుడికి కుమారుడు , కుమార్తె ఉన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు ,ఎస్‌యుడి టీంకే శ్రవణ్ , బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ సత్తయ్య ,సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థికి షీల్డ్ అందజేత

నవతెలంగాణ- ఆలేరురూరల్

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆలేరు జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థి బండ్రు నవదీప్‌కు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కాసుల నరేష్ గురువారం షీల్డ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ సీనియర్ నాయకులు రాజేష్, ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ ,హరినాథ్ రెడ్డి ,సోమరాజు ,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మహిళ వికలాంగులు ఆత్మస్థైర్యతో ముందుకు సాగాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టు పల్లి అనురాధ

నవతెలంగాణ - భువనగిరి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటపల్లి రజిత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్థానిక భువనగిరి పట్టణ కేంద్రం లో నిర్వహించారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టు పల్లి అనురాధ మాట్లాడుతూ మహిళలు సమాజములో ఎన్నో ఏండ్లుగా అణిచివేతకు గురవుతున్నారన్నారు. 75 ఏండ్ల స్వాతంత్ర్య భారత దేశంలో మహిళల పై దాడులు జరగడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు .మహిళలు నిరుత్సాహ పడకుండా పోరాటాల ద్వారా మహిళా వికలాంగులు తమ హక్కులు సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు సురుపంగా ప్రకాష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, , మహిళా విభాగం జిల్లా కన్వీనర్ కొత్త లలిత, కొండమడుగు మనోహర, కొనసోత్ అనుసూర్య, గ్యార సరిత, బోడ అంశమ్మ, గీసా గీత, పాల్గొన్నారు

12న ఎస్ఎస్‌సీ 16 బ్యాచ్ పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం

నవతెలంగాణ-మోత్కూర్



మోత్కూర్ విశ్వభారతి ఉన్నత పాఠశాలలో చదువుకున్న ఎస్ఎస్‌సీ 16 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం ఈనెల 12న స్థానిక సుమంగళీ ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్టు విశ్వభారతి గెట్ టు గెదర్ కన్వీనర్లు తెలిపారు. పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం బ్రోచర్‌ను గురువారం స్థానిక గ్రంథాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వభారతి పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన 16 బ్యాచ్ ల విద్యార్థులందర్నీ ఒకే వేదిక పైకి తీసుకురాబోతున్నామని, విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గెట్ టు గెదర్ కన్వీనర్లు కోమటి మత్స్యగిరి, పురుగుల శ్రీను, చొల్లేటి నరేష్, బొల్లెపల్లి శ్రావణ్, ఎండి.అక్బర్, నల్ల ప్రభు, చొల్లేటి సోమేష్, అవిశెట్టి నాగరాజు, గొడిశాల రవి, కొలిపాక గోపి, కోటమర్తి రమేష్, కట్ట ఇందిరాజ్యోతి, చెరుకు మాధవి, పట్వారి సువర్ణ, నోముల రమేష్, వెంపల్ల నర్సిరెడ్డి, ఎడ్ల శ్రీకాంత్, బొద్రబోయిన ప్రవీణ్, మన్నే కరుణాకర్, కొల శివ, పురుగుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్దీపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ



నవతెలంగాణ- రామన్నపేట

అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రామన్నపేట, సిరిపురం, నిర్నేముల, దుబ్బాక గ్రామాలలో ఉద్దీపన ఫౌండేషన్ చైర్మెన్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం సమకూర్చిన చీరలను గురువారం అంగన్వాడీ టీచర్లకు, ఆయాలకు, ఆశావర్కర్స్ కు, ఏఎన్ఎం లకు, పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ కార్యకవ ంలో సర్పంచ్ శిరీష పృథ్వీరాజ్, దుబ్బాక ఎంపీటీసీ మాదురి జ్యోతి, న్యాయవాది సుక్క శ్రవణ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, సిరిపురం పద్మశాలీ సంఘం ప్రధానకార్యదర్శి రాపోలు రమేష్, ప్రైవేట్ బస్సు యాజమాన్యం సంఘం అధ్యక్షులు ఎల్లా సంతోష్ రెడ్డి, నిర్నేముల వార్డు సభ్యులు నోముల ప్రవీణ్ కుమార్, నాగటి మహేష్, సుర్వీ సతీష్, యూత్ నాయకులు నోముల విష్ణు, సుర్వీ నవీన్, బతిని ఉపేందర్, నోముల సైదులు, చంటి, మోతె మల్లేశం, అప్పం గణేష్, గాదె యాదయ్య, శివరాత్రి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-చౌటుప్పల్

లయన్స్ క్లబ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో నాంపల్లి రాజయ్య, సావిత్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నాంపల్లి రమేశ్, సంగీత సహకారంతో గురువారం పట్టణకేంద్రంలో ఏర్పాటుచేసిన చలివేంద్ర కేంద్రాన్ని మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేసిన రమేశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కాసుల వెంకటేశ్, దాచేపల్లి ప్రకాశ్, కటకం ప్రశాంత్, గోశిక కరుణాకర్, వేముల నర్సింహ, సూరాజు సత్యనారాయణ, సిలివేరు మంగయ్య, ఉష్కాగుల శ్రీనివాస్, సుర్వి నర్సింహగౌడ్, దాచేపల్లి శ్రీనివాస్, దేప అనిల్, వనం రాజు పాల్గొన్నారు.

ఈడీ,మోడీ లకు బెదిరేది లేదు

నవతెలంగాణ -రాజాపేట



ఈడీ, మోడీల బెదిరింపులకు బీఆర్ఎస్ నాయకులు బెదిరే ప్రసక్తే లేదని రజక సంఘం రాష్ట్ర నాయకుడు సట్టు తిరుమలేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఉనికి చాటుకోవడం కోసం తెలంగాణ నాయకుల పై కక్షపూరిత చర్యలకు పాల్పడుతుందన్నారు. ఈడీ, మోడీలకు తెలంగాణ ప్రజా ప్రతినిధులు తల వచ్చేదే లేదని తెలిపారు. తెలంగాణ ప్రజానీకం కన్నెర్రజేస్తే బీజేపీ మాడి మసైపోతుదని హెచ్చరించారు. కల్వకుంట్ల కవితక్క ఒక్క పిలుపునిస్తే లక్షలాదిమంది అభిమానులు తరలివస్తారన్నారు. కవితపై కక్షపూరితంగా కేసులు పెట్టి ఇరికించాలని బీజేపీ చూస్తోందన్నారు. రాబోయే కాలంలో ఢిల్లీ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎర్రగోగుల జశ్వంత్,జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ సందిల భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గీత కార్మికునికి 15వేల చెక్కు అందజేత

నవతెలంగాణ -రామన్నపేట

మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వీరమళ్ళ శంకరయ్య గౌడ్ ఇటీవల తాటిచెట్టుపై నుండి పడి గాయపడ్డాడు. తాడి కార్పొరేషన్ ద్వారా గురువారం రూ.15 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత గౌడ సంఘం యువజన విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరమళ్ల కార్తీక్ గౌడ్ , జిల్లా అధ్యక్షులు కొండ గిరి గౌడ్, గ్రేటర్ హైదరబాద్ ప్రధాన కార్యదర్శి బందారం అనిల్ గౌడ్, ఉపాధ్యక్షులు నందగిరి ఆంజనేయులు గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు పులి బిక్షం, వీరమళ్ళ రమేష్, పల్చం శ్రీకాంత్ గౌడ్, వీరమళ్ళ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన కార్యక్రమం కంటి వెలుగు



నవతెలంగాణ -రామన్నపేట

కంటి వెలుగు కార్యక్రమం అద్భుతమైన కార్యక్రమమని, దేశానికే ఆదర్శంగా నిలిచిందని స్థానిక సర్పంచ్ గోదాసు శిరీష పృథ్వీరాజ్ అన్నారు. గురువారం కంటి వెలుగు కార్యక్రమం ముగిసిన సందర్భంగా వైద్యులను, సిబ్బందిని, ఏఎన్ఎం, ఆశా వర్కర్లను గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 19న ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమం నేటితో ముగిసిందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రారంభించిన కంటి వెలుగు కార్యక్రమంను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించడం తెలంగాణకు గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ2 యండి. రెహన్, డాక్టర్ నరేందర్ కుమార్, డాక్టర్ పర్వేజ్, వార్డు సభ్యులు లెంకల జ్యోతి ప్రవీణ్, గోలుసుల. ప్రసాద్, ఏటెల్లి సునీత శ్రీనివాస్, కొమ్ము సుష్మితా శేఖర్, సూపర్వైజర్ వాణిశ్రీ, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికునికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ -రామన్నపేట

గీత కార్మికులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని సిరిపురం గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, వృత్తిదారులు తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన పబ్బు స్వామి (58) వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి మెరపెడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. తోటి వృత్తిదారులు గమనించి ఆయనను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం నిమిత్తం నల్గొండ తరలించాలని వైద్యులు సూచించడంతో నల్గొండ ఆసుపత్రికి తరలించారు.

బావిలో పడి వ్యక్తి మృతి

భూదాన్‌పోచంపల్లి:బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పోచంపల్లి పట్టణ కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై సైదిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పోచంపల్లి గ్రామానికి చెందిన ఒంటెద్దు స్వామి (22) గ్రామంలో హోలీ ఆడి స్నానం చేసేందుకు సీతావానిగూడెం గ్రామ శివారులోని మేడి బావిలోకి వెళ్ళి స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ నీట మునిగి చనిపోయాడు.మంగళవారం రోజు సాయత్రం కొడుకు కనపడట్లేదని స్వామి వెతుకుతుండగా బుధవారం మేడి బావి వద్ద తన కొడుకు బట్టలు చూసి బావిలోని పడవచ్చునని అనుమానంతో స్థానికులకు పోలీసులకు.చెప్పడంతోనీటినీనంత గ్రామస్తుల సాయంతో మోటార్లు పెట్టి గురువారం మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు పంచనామ నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు .

ప్రత్యామ్నాయ పంటలతోనే అధిక లాభాలు

నవతెలంగాణ -భూధాన్ పోచంపల్లి

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించి అధిక లాభాలు పొందాలని జెడ్పీటీసీ కోట పుష్పలత అన్నారు గురువారం మండల పరిధిలో కనుముక్కల గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ముడుపు రవీందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌ఫామ్ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలార్జించే పంటల పైన అవగాహన పెంచుకోవాలన్నారు. తక్కువ నీటితో పండే పంటల వైపు మొగ్గు చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి కె కవిత ,ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ కె హరీష్ కుమార్ ,వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్ , రైతులు పాల్గొన్నారు.

ఘనంగామహిళా దినోత్సవం

నవతెలంగాణ -ఆలేరు రూరల్



మండలంలోని గొలనుకొండలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో బైరపాక బెంజిమెన్ అధ్యక్షతన ప్రపంచ మహిళా దినోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాన్సర్ రాకేష్ మాస్టర్ కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు జేరిపోతుల పరుశురాం హాజరై మాట్లాడారు అనంతరం మహిళలకు శాలువతో ఘనంగా సన్మానించి షీల్డ్ అందజేశారు. .ఈ కార్యక్రమంలో ఓయూ జేఏసీ రాష్ట్ర మహిళా కన్వీనర్ జన్నె వెన్నెల, గ్రామ సర్పంచ్ బైరపాక లక్ష్మి ,ఎంపీటీసీ బాకీ లక్ష్మి, కళాకారులు గజ్జల రామచందర్ వార్డు సభ్యులు సరోజన ,కవిత ,లక్ష్మి, రజిత ,మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో షెడ్ నిర్మాణం

ఆలేరు రూరల్: ఆలేరు మండలం మంతపురి గ్రామంలో శ్రీ నల్ల పోచమ్మ గుడి నిర్మాణం కోసం దాతల సహకారంతో రూ.3 లక్షలతో నిర్మించిన షెడ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, పడగల రాజు, పేరపు సిద్దులు, పేరపు నర్సింలు ,చెక్కిల రవి ,పల్లె శ్రీనివాస్ ,కర్రే ఎల్లయ్య నిర్మాణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తె,మెట్టెలు అందజేత



నవతెలంగాణ -భువనగిరిరూరల్

మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ తంగేలపల్లి కల్పన శ్రీనివాస చారి తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేగు బీరయ్య కుమార్తె ఝాన్సీ వివాహానికి పుస్తె, మెట్టెలు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్మలమ్మ జార్జ్ శ్రీశైలం పాల్గొన్నారు .

మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలి

నవతెలంగాణ - భువనగిరి



మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని విధాత ఫౌండేషన్ చైర్మెన్ గుజ్జ రమేష్ గారు కోరారు గురువారం స్థానిక స్టాన్ఫోర్డ్ మహిళా డిగ్రీ కళాశాలలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల రాజు అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది ఎంఏ రహీం. కౌన్సిలర్లు తంగళ్ళపల్లి శ్రీవాణి, నల్ల మాస సుమలత ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటికల లావణ్య, బీసీ సంఘం సీనియర్ నాయకులు కోనూరు నరసింహ, విధాత ఫౌండేషన్ సభ్యులు మౌలి, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



నవతెలంగాణ -ఆలేరురూరల్

గ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తామని సర్పంచ్ వంగాల శ్రీశైలం అన్నారు. గురువారం మండలంలోని తూర్పు గూడెం గ్రామంలో పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధి లైట్ల సమస్య నీటి సమస్య పారిశుధ్య సమస్య లేకుండా చూస్తామన్నారు. గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇందిరా, వార్డు సభ్యులు అంజయ్య ,పోచయ్య, సత్యనారాయణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే నాయకుడికి పట్టం కట్టాలి

నవతెలంగాణ -ఆలేరురూరల్

ప్రజలతో ఐక్యమత్యంగా ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించే వారికి పట్టం కట్టాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండలంలోని మంతపురి గ్రామంలో నాయీ బ్రాహ్మణులకు షేవింగ్ కటింగ్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎవరికి ఎక్కడ ఆపద వచ్చినా నేను ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు నోముల చందు ,నాయకులు స్వామి, మల్లయ్య ,బాలి, సతీష్ ,సత్తయ్య ,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



ఆలేరురూరల్:మండలంలోని కొలనుపాక గ్రామంలో ఎస్ఆర్జిఎస్ నిధుల నుంచి 50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి గురువారం ప్రారంభించారు .ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుర్రాల బాలరాజు, తోడేటి నరేందర్ ,అమృతం బాలరాజు, గౌండ్ల మఠం రాజశేఖర్ ,జంగా పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటలపోటీలు

భువనగిరి :యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పాత మున్సిపాలిటీ కార్యాలయం లో యాక్షన్ - ఎయిడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారందరికీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శిశుగృహ, బాలసదన్, సఖీ శాఖల వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ శాఖ అధికారి సైదులు ,శిశుగృహ, బాలసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారిణి దీపికకు ఎమ్మెల్యే అభినందన

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన కబడ్డీ క్రీడాకారిణి ఉంద్రాతి దీపికా జాతీయ స్థాయిలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఎంపిక కావడంతో దీపికా ను గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అభినందించి 25 వేల రూపాయిల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పుల్లంల ముత్తయ్య, బద్దం రాంరెడ్డి చాంద్ పాషా ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలకు కృషి

నవతెలంగాణ-పెద్దఅడిశర్లపల్లి

మండలంలోని గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని పీఏ.పల్లి జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జడ్పీఫ్లోర్ లీడర్ ఏ.శోభారాణి అన్నారు. గురువారం మండలంలోని చిలకమర్రి గ్రామపంచాయతీ పరిధిలో గల సూరేపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రింద మంజూరైన రూ.15 లక్షల విలువైన సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కేతావత్ విజయ లక్ష్మి మున్నానాయక్, పంచాయతీ కార్యదర్శి వై.భవాని, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వీరబోయిన యల్లయ్యయాదవ్, ఎంపీటీసీ ఏ.వెంకటేశ్వర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోడియ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.గోవర్ధన్‌రెడ్డి, ఎన్.సతీష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్డి సంక్షేమ సంఘ భవనంకు శంకుస్థాపన

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడలో శుక్రవారం రెడ్డి సంక్షేమ సంఘం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు అనుముల మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 లక్షల రూపాయల ఎమ్మెల్సీ నిధులతో నిర్మించనున్న ఈ భవన నిర్మాణ శంకుస్థాపన పనులకు శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కౌసల్య మృతి బాధాకరం

నవతెలంగాణ-దేవరకొండ

పట్టణంలోని 18వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎస్ఎన్.చారి తల్లి నారోజు కౌసల్య మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో కౌసల్య దశదిన కర్మలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ రహత్ అలీ, స్థానిక కౌన్సిలర్ వీరమని అంజిగౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, వెంకటయ్యగౌడ్, విజయ, వెంకన్న, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి పెరగడం వల్ల దేశ ప్రగతి

నవతెలంగాణ-దేవరకొండ

మహిళా శక్తి పెరగడం వలన దేశ ప్రగతి సాధ్యమని ఎంకెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. రామరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. శారదా దేవి అన్నారు. గురువారం స్థానిక ఎంకెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. అలివేలు, కే.రేణుక ,ఎస్‌కే. ఆరిఫా, సిహెచ్. గీత, ఎస్. నర్మదా, దేవి, పి.జగతి, ఏ. కల్పన, ఎం. లింగమ్మ, ఎం .అలివేలు, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

నార్కట్ పల్లి పట్టణానికి చెందిన బత్తిని రవి (ఎలక్ట్రీషన్) రోజువారీగా తమ విద్యుత్ పని నిర్వహిస్తుండగా ఇటీవల విద్యుత్ షాక్ తగిలి అనారోగ్య బారిన పడ్డారు. విషయం తెలుసుకున్న చిరుమర్తి చేయూత ఫౌండేషన్ చైర్మెన్ చిరుమర్తి మనోజ్ గురువారం వారి నివాసానికి చేరుకుని బాధితుడిని పరామర్శించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి, 15 వేల రూపాయలను తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు వాజిద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు దుబ్బాక శ్రీధర్, బొబ్బిలి దేవేందర్, పాల్గొన్నారు.

పెయింటర్ అనిల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

భవనం పెయింటింగ్ పని చేస్తూ ప్రమాద వశాత్తు జారీ పడి మృతి చెందిన ముక్కుడు దేవులపల్లి గ్రామ వాసి నారపాక అనిల్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఆల్ ఇండియా పెయింటర్స్ అసోసియేషన్ జాతీయ నాయకులు రఫీ క్యూ అన్సారి తెలిపారు.గురువారం మృతుడు అనిల్ కుటుంబాన్ని సందర్శించి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా అనిల్ కుటుంబానికి అసోసియేషన్ తరపున అనిల్ భార్య సంధ్యకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి ఓమర్ ఖాన్, ప్రవీణ్, అర్జున్, అరుణ్, కుమార్ షా, షాబాద్అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు మట్టాచారి మృతి

నవతెలంగాణ -నేరేడుచర్ల

మండలంలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు దేవోజుమట్టాచారి(50) అనారోగ్య కారణంగా బుధవారం రాత్రి మృతిచెందాడు.. ఆయన భౌతికకాయాన్ని జెడ్పీటీసీ రాపోలు నరసయ్య , బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అరి బండి సురేష్ బాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ అనంత్ శ్రీనివాస్ గౌడ్, పంగా నాగరాజు ఆయన మిత్రులు ముదుసు నాగరాజు యాదవ్ తరక వెంకటేశ్వర్లు వాసి కర్ల నరసయ్య, పంగ పెద్ద నాగరాజు, సట్టు శీను, నర్సింగ్. శ్రీనివాస్ గౌడ్, మట్టయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థిని గెలిపించండి

- జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం

నవతెలంగాణ-నాంపల్లి

బీహైదరాబాద్-మహబూబ్ నగర్-రంగారెడ్డి ఉమ్మడి జిల్లాకు, టీఎస్‌యూటీఎఫ్ బలపర్చిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం పిలుపునిచ్చారు. గురువారం నాంపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా బలపరిచిన పాపన్న మాణిక్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాణిక్‌రెడ్డి అందించిన సేవల గురించి వివరించారు. మాణిక్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు, గేర నర్సింహ, నలపరాజు వెంకన్న, మునుగోడు మండల అధ్యక్షుడు,పెరిక నరసింహ, చండూరు మండల ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణరెడ్డి, యాదగిరి రెడ్డి, పాండు, నర్సింహ పాల్గొన్నారు.



చీరలు పంపిణీ

నవతెలంగాణ-చిట్యాల

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే ఉద్దీపన చైర్మెన్ వేముల వీరేశం సౌజన్యంతో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాటం వెంకటేశం ఆధ్వర్యంలో గురువారం చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ పంచాయతీలలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్లు, అంగన్‌వాడీ ఆయాలు, గ్రామపంచాయతీ సిబ్బంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ దేవస్థాన కమిటీ మాజీ చైర్మెన్ తొలుసూరి సైదులు, విద్యా కమిటీ వైస్ చైర్మెన్ నీలకంఠం నరేష్, ప్రాథమిక పాఠశాల చైర్మెన్ ఏర్పుల సైదులు, ఓర్సుస్వామి, బత్తుల లింగస్వామి, జక్కుల వీరమల్లు, కిష్టయ్య, ధర్మయ్య, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

ప్రధానమంత్రి కౌశిక్ వికాస్ యోజన పథకంలో కొత్తగా ప్రవేశపెట్టిన ఉచిత షార్ట్ టర్మ్ కోర్సులకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులు లేదా ఐటీఐ మధ్యలో ఆపివేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐ కళాశాల నల్లగొండలో ఈనెల 28 లోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యం

నవతెలంగాణ-చింతపల్లి

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే ప్రభుత్వం లక్ష్యమని ప్రశాంతపురి తండా సర్పంచ్ కేతావత్ బంగారి జగన్, ఎంపీటీసీ కుమ్మం శ్వేతా శ్రీశైలంగౌడ్ అన్నారు. గురువారం చింతపల్లి మండలం ప్రశాంతపురి తండా గ్రామపంచాయతీలో కంటి వెలుగు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మార్తమ్మ, సుకన్య, ఆశ వర్కర్లు సైదమ్మ , యాదమ్మ, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ప్రతి గ్రామంలో అంధత్వ నివారణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పల్లెపాడు గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌రెడ్డి, అక్కనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు అరుదైన గౌరవం

- మోడల్ జీపీగా ఎల్లారెడ్డిగూడెం గుర్తింపు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామపంచాయతీని స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో ఉత్తమ గ్రామపంచాయతీగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ గుర్తించి ఆ గ్రామ సర్పంచ్ మేడి పుష్పలత శంకర్‌కు జిల్లాలోనే అరుదైన గౌరవం ఇచ్చింది. దీంతో పాటు ఉత్తమ సర్పంచ్‌గా జిల్లా డీఆర్డీఏ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ వారి ఆధ్వర్యంలోగ్రామ సర్పంచ్ మేడి పుష్పలత శంకర్‌ని మేమెంటో, అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, ఎస్బీఎం కోఆర్డినేటర్లు శంకర్‌బాబు, మొయినోద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, డీఆర్డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

వేముల వెంకటేశ్వర్లు మృతిపట్ల సంతాపం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్ నగర్ పట్టణంలోనే క్లాస్ వన్ కాంట్రాక్టర్ వేముల నరసయ్య తండ్రి వేముల వెంకటేశ్వర్లు శివాలయం సమీపంలో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి గుండెపోటు రావటంతో మృతి చెందాడు. నిజాయితీపరుడుగా, మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న వెంకటేశ్వర్లు మృతికి పట్టణంలోని పలువురు రాజకీయ నాయకులు, స్నేహితులు, బంధువులు, ప్రముఖులు, పత్రికా విలేకరులు హాజరైసంతాపం తెలియజేశారు. ఆయన మరణం తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

నేడు ఫ్రీ బిడ్ అవగాహనా సదస్సు

నవతెలంగాణ-నల్లగొండకలెక్టరేట్

నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో ఎంజీ యూనివర్సిటీ ఎదురుగా శ్రీ వల్లి టౌన్ షిప్‌లో మూడు విడతల ప్రత్యక్ష వేలం తర్వాత మిగిలిన రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లు (133), పాక్షిక నిర్మాణ గృహాలు (253) విక్రయానికి ఫ్రీ బిడ్ అవగాహన సదస్సు నేడు సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్రీ బిడ్ సమావేశంలో ఆసక్తి ఉన్న ఔత్సాహికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 9154339209 లేదా nalgonda.telangana.gov.in వెబ్ సైట్‌ను సందర్శించి తెలుసుకోవాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్

నవతెలంగాణ-దేవరకొండ

దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఎంజీ. రెడ్డి బస్సులో తనకు దొరికిన బ్యాగును డిపోలో అందజేసి నిజాయితీని చాటుకున్నట్లు డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాదు నుంచి దేవరకొండకు వస్తున్న బస్సులో గుర్రంగూడకు చెందిన కే.విజయలక్ష్మి అనే మహిళ ప్రయాణికురాలు మాల్ వరకు వచ్చి ఆమె కంగారులో తన బ్యాగును మర్చిపోయి దిగిందని. అనంతరం డ్రైవర్ గమనించి బ్యాగును దేవరకొండ డిపోలో అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ భారతి బాయ్ విచారణ జరిపి బాధిత మహిళలకు అప్పగించారు. బ్యాగులో ఐదు తులాల బంగారం ఉన్నట్లు బాధిత మహిళా పేర్కొంది. తన నగలను భద్రంగా అప్పగించినందుకు డ్రైవర్‌కు, ఆర్టీసీ అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాలభివృద్ధికి కృషి

నవతెలంగాణ-దేవరకొండ

గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ మారుపాకల అరుణ సురేష్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని తాటి కోల్ గ్రామంలో గౌడ కులస్తుల కోరిక మేరకు లింగమయ్య స్వామి దేవస్థానం ప్రహరీ గోడ, గుడి ముందు నంది మండపం తన సొంత ఖర్చులతో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జూలూరు గిరి, ఉపసర్పంచ్ సామల రవిగౌడ్, మాజీ ఉపసర్పంచ్ పల్లర్ కాటన్‌గౌడు, ఎరుకల లక్ష్మీనారాయణగౌడ్, సత్యనారాయణ, కృష్ణ, బాలయ్య, కృష్ణయ్య, అంజయ్య, లాలయ్య, పెద్ద నాగయ్య, చిన్న నాగయ్య, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు మైనార్టీ రుణమేళ

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మైనార్టీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం పొందేందుకు దరఖాస్తులు చేసిన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నేడు ముఖాముఖి నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హతలు అర్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలను ఒరిజినల్ ప్రతులతో ముఖాముఖికి హాజరుకావాలని కోరారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హుజూర్‌నగర్

దళిత హక్కుల పోరాట సమితి ప్రథమ మహాసభల పోస్టర్‌ను గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం ముందు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసు రత్నం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీలో మహాసభ ఉంటుందని ఈ సభకు దళితులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేయాల్సిన కృషి చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోపోజు సూర్యనారాయణ సీపీఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, సాలమ్మ, అన్నమ్మ, తిరుపతమ్మ, నాగమ్మ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా మిషన్ భగీరథ నీళ్లు



నవతెలంగాణ- మోతే

అధికారుల శ్రద్ధ వలన మిషన్ భగీరథ నీళ్లు వృథాగా వెళ్లిపోతున్న పట్టించుకునే నాధుడు లేడని ప్రజలు తెలుపుతున్నారు. మండల పరిధిలోని లాల్ తండా ఆవాసం వేణి తండా గ్రామానికి వచ్చే పైపులు పగిలి ఊర్లోకి రావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా ఇలా ప్రవహిస్తున్న అధికారులకు పట్టింపు లేదని ఆరోపిస్తున్నారు. లాల్ తండా సమీపంలో ఉన్న ట్యాంకు గుండా ఒక రైతు నీళ్ల వాడుకుంటున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. వెంటనే అధికారులు ఈ పరిస్థితి చక్కదిద్దాలని కోరుతున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ- భువనగిరిరూరల్

జిల్లా కేంద్రంలో శ్రీ సాయి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో బసవపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాసాల శ్రీనివాస్ యాదవ్ కూతురు వివాహానికి హాజరైన భువనగిరి ఎమ్మెల్యే పైల శేఖర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు జనగాం పాండు, మండల ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్,మండల మహిళా అధ్యక్షురాలుచంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వేముల

నవతెలంగాణ -రామన్నపేట

మండల కేంద్రానికి చెందిన బీఆర్ ఎస్ నాయకులు వీరమల్ల లక్ష్మీనారాయణ కూతురి వివాహ వేడుకల్లో స్థానిక మాజీ ఎమ్మెల్యే, ఉద్దీపన చైర్మెన్వేముల వీరేశం పాల్గోని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ జెల్ల వెంకటేశం, బిఆర్ఎస్ మండల నాయకులు పూస బాల కిషన్, గోదాస్ పృద్వీరాజ్, ఎంపిటిసి ఎండి రెహాన్, ఎండి అక్రమ్, మాజీ ఉప సర్పంచ్ కూనూరు కృష్ణగౌడ్, పాల సంఘం పట్టణ మాజీ చైర్మన్ మోటే రమేష్, కోట సుధాకర్, బుర్రి రవి, గొరిగే శేఖర్, సాల్వేరు లింగం, కేశవదాసు సునీల్, వీరమల్ల నరసింహ, గోదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే చిరుమర్తి.

మండల కేంద్రంలోని మల్లికార్జున ఫంక్షన్ హాల్ లో బోగారం గ్రామానికి చెందిన కూనూరు రాంబాబు గౌడ్ సోదరి వివాహానికి, విపిఆర్ ఫంక్షన్ హాల్ లో మునిపంపుల గ్రామానికి చెందిన చిత్తలూరి మల్లేష్ గౌడ్ కుమార్తె మొదటి జన్మదిన వేడుకకు స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ నంద్యాల బిక్షం రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోషబోయిన మల్లేశం, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఎండి ఆమేర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టినరోజు వేడుకల్లో దైద రవీందర్

మండలంలోని మునిపంపుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు చిత్తలూరి మల్లేశం కుమార్తె మౌళిక పుట్టిన రోజు వేడుకలలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఇంచార్జ్దైద రవీందర్ పాల్గొని ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రామన్నపేట మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లారెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు నల్లా వెంకట్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉయ్యాల లక్ష్మీనరసింహ, మండల నాయకులు నల్ల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-సూర్యాపేట

తొర్రూరు మండలం చీకటయపాలెంకి చెందిన లింగమంతుల స్వామి పెద్దగట్టు పూజారి(దేవర పెట్టే తీసుకువచ్చే) తండు పుల్లయ్య కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. ఆయన సతీమణి తండు కొమరమ్మ కు పెద్దగట్టు ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ కోడి సైదులు యాదవ్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సహాయాన్ని గురువారం చీకటయపాలెంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాస శ్రీనివాస్ యాదవ్, మట్టపల్లి శ్రీనివాస్ యాదవ్, చింతకాయల జానయ్య యాదవ్, మెంత బోయిన సింహాద్రి యాదవ్ ,మొండి కత్తి దుర్గమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యులు మెంతబోయిన వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

పెద్దింటి పుల్లయ్య మృతి

నవతెలంగాణ-ఆత్మకూరుఎస్

మండలంలోని ముక్కుడు దేవులపల్లి గ్రామానికి సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ సీనియర్ నాయకులు పెద్దింటి పుల్లయ్య ఆకాల మరణం చెందారు. ఆయన భౌతికకాయానికి ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య న్యూడెమోక్రసీ అరుణ పతాకన్ని కప్పారు. పీవై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కునికుంట్ల సైదులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగయ్య, బయ్య వెంకన్న, పిడీఎస్యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, డివిజన్ ఉపాధ్యక్షులు వంశీ, దాసరి శ్రీనివాస్, నాయకులు బాలస్వామి, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో బెల్టు దందా..?

- యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు!
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డు లేదు

నవతెలంగాణ -చండూర్

మండలంలో మద్యం బెల్ట్ షాపులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. ప్రతి గ్రామంలో తోపాటు మున్సిపల్ పట్టణంలోనూ గల్లీకో బెల్ట్ దుకాణాలు కనిపిస్తుండగా, మరికొందరు కిరాణా షాపుల్లోనూ మద్యం అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.గ్రామాల్లో అడుగడుగునా ఉన్న బెల్ట్ షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పుట్టగొడుగుల బెల్ట్ షాపులు పుట్టుకొస్తున్నాయి అని మహిళలు మండిపడుతున్నారు.

మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో ఈనెల 5నుంచి శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. వరుసగా వారం రోజులపాటు జాతర బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయం పరిసర భూముల్లో ప్రత్యేక షెడ్యూల్ ఏర్పాటు చేసుకొని దుకాణాల పేరుతో తెల్లవారుజాము నుండి మొదలుకొని రాత్రి వేళలో దాకా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తున్నారు. జాతరకు వచ్చే మహిళలు మందుబాబుల హల్చల్తో తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు. ప్రతి ఏటా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో లక్షలలో బెల్ట్ దందా జోరుగా, బహిరంగంగా నడుస్తోంది. ఈ దందా వైన్స్ యజమానులు సిండికేట్ గా మారి తమ కనుసన్నల్లో ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేయించుకుని మద్యం విక్రయిస్తున్నారు. తమను పట్టించుకోకుండా ఉండాలని ఆబ్కారి శాఖ అధికారుల సైతం ముడుపులు అప్పజెప్పి తమ దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ దండో కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు, తనిఖీ చేసిన దాఖలు ఎక్కడ కూడా లేవు. ఒక్కొక్క బాటిల్ పై సుమారు 200 రూపాయలు



అదనంగా మందు బాబులం నుండి ముక్కు పిండి వసులు చేస్తున్నారు. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో తూగి ఆ వైపు కన్నీటి చూడడం లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతోపాటు రాత్రి వేళలో మద్యం సేవించిన మందుబాబులు జాతరకు వచ్చిన మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లో పేకాట రాయలు, కాయ్ రాజా కాయ్, ఇతర ఆటలతో యువత మునిగితేలుతూ డబ్బుల్ని వృధా చేసుకుంటున్నారు. పోలీస్ శాఖ అధికారుల సైతం గస్తీ నిర్వహించకపోవడంతో హద్దు, అదుపు లేకుండా పోయింది. బెల్ట్ షాపును ప్రోత్సహిస్తే శాంతి భద్రత సమస్య ఏర్పడే ప్రమాదం ఉందని మహిళలు అభిప్రాయపడుతున్నారు. మధ్య సేవించి రాత్రి వేళల్లో యువకులు ఒకరిపై ఒకరు దాడులకు పూనుకుంటున్నారు. చదువుకునే యువకులు సైతం స్నేహితులతో కలిసి మద్యం మత్తులో తూలుతూ ఘర్షణలకు దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

బెల్ట్ షాపులు నియంత్రించాలి
సీపీఐ(ఎం)నాయకులు బొట్టు శివకుమార్



గ్రామాల్లోనూ బెల్ట్ షాపులు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి. అడ్డూ అదుపు లేకుండా పోయింది. నియంత్రించాల్సిన అధికారులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు. తుమ్మలపల్లి జాతరలో బెల్ట్ షాపు లు అడ్డూ అదుపు లేకుండా జోరుగా విక్రయిస్తున్నారు. ఎప్పుడు తనిఖీ చేసిన దాఖలాలు లేవు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసి బెల్ట్ షాపులను నియంత్రించాలి.

ఫిర్యాదు చేస్తే బెల్ట్ షాపులపై కేసు నమోదు చేస్తాం
ఆబ్కారి సీఐ మల్లయ్య

ప్రస్తుతం బెల్టు షాపులపై ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదు. గ్రామాలలోనూ పట్టణంలోనూ ఎవరైనా బెల్ట్ షాపులపై ఫిర్యాదు చేస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం. తుమ్మలపల్లి జాతరలో బెల్ట్ షాపులు వికయాలపై తమ దృష్టికి రాలేదు. ఒకవేళ వస్తే జాతరలో బెల్ట్ షాపులో విక్రయించిన వారిపై చర్యలు తీసుకుంటాం.

మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్ కుమార్

నవ తెలంగాణ-మోత్కూరు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు వారి అభ్యున్నతికి పెద్ద పీట వేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరికిశోర్ కుమార్ అన్నారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మార్కెట్ యార్డు ఆవరణలోమహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మోత్కూర్, అడ్డగూడూర్ మండలాల మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవ కానుకగా వడ్డీ లేని రుణాలతో పాటు ఆరోగ్య మహిళా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. అనంతరం మన ఊరు మన బడి లో అభివృద్ధి చేసిన మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్, గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించగా, ఉన్నత పాఠశాలలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, డీఆర్డీవో మందడి ఉపేందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి, మున్సిపల్చైర్మన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి, జెడ్పీటీసీ గోరుపల్లి శారదసంతోష్ రెడ్డి, ఎంపీపీ రచ్చ కల్పనలక్ష్మీనర్సింహ్మారెడ్డి, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, రైతుబంధు మండల కోఆర్డినేటర్లు కొండా సోంమల్లు, తీపిరెడ్డి మేఘారెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు రమేష్, బొడ్డుపల్లి కళ్యాణచక్రవర్తి, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

25శాతం మెస్ చార్జీలు పెంపు

నవతెలంగాణ- ఆలేరు

ప్రభుత్వం విద్యారంగా అభివృద్ధిలో భాగంగానే సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు 25శాతం మెస్ చార్జీలు పెంపుకు నిర్ణయం తీసుకుందని బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షులు బింగి గణేష్ అన్నారు. మండల కేంద్రంలో గురువార హాస్టల్లో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ , విద్యార్థుల సమస్యల పరిష్కారం కొరకు, ప్రభుత్వానికి, ఆలేరు నియోజకవర్గంలో విద్యార్థులకు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీ టు పీజీ విద్య అమలు చేసి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని చెప్పారు . ఈ కార్యక్రమంలో నాగరాజు, కటకం బాలరాజు, ప్రశాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంధత్వరహిత తెలంగాణ కోసమే కంటి వెలుగు

నవతెలంగాణ -తుంగతుర్తి

కంటి వెలుగు పథకం ద్వారా అంధత్వరహిత తెలంగాణగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని బండరామారం గ్రామంలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ మడ్డి నాగలక్ష్మి,ఉప సర్పంచ్ పులుసు ఇందిరా ఉప్పలయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు, వీరబోయిన రమేష్ ,మండల వైద్యాధికారి డాక్టర్ నాగు నాయక్, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమయ్య, చారి ,యాదగిరి ఏఎన్ఎం భారతి అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సుశీలకు సన్మానం

హుజూర్నగర్ : పట్టణానికి చెందిన అన్నమయ్య భజన మండలి గౌరవ అధ్యక్షురాలు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, జీవిత సాఫల్య పురస్కార అవార్డు గ్రహీత గుండా సుశీలను గురువారం మున్సపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత అధ్యక్షురాలు సుభాషిని, కందిబండ వాసవి తదితరులు పాల్గొన్నారు.

యేసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలి

పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

నవతెలంగాణ-నాగార్జునసాగర్

యేసుక్రీస్తు చూపిన సత్యమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని గుంటూరు పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. గురువారం సాగరమాత మహోత్సవాలు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన భక్తులనుద్దేశించి దైవ సందేశాన్ని అందజేశారు. ప్రతి ఒక్కరూ పరిపూర్ణ హృదయంతో,సంపూర్ణ విశ్వాసముతో, యదార్థంగా దేవుని ప్రార్థించాలన్నారు. క్రీస్తును విశ్వసించి ఆంగీకరిస్తే దేవుని రక్షణ కలుగుతుందన్నారు. ఈ .కార్యక్రమంలో సాగరమాత ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్,వివిధ జిల్లాల క్రైస్తవ గురువులు,కన్యస్త్రీలు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్యకు ఘన స్వాగతం

గుంటూరు పీఠాధిపతులు డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య ను స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి భాజా భజంత్రీయులు, కోలాటం, నృత్యాలు, బాణాసంచాలతో గుర్రపు వాహనంతో సాగరమాత ఆలయంకు తీసుకువచ్చారు. అనంతరం ఆయన ప్రధానగేటుకు ఇరువైపుల ఏర్పాటు చేసిన నిత్య సహాయమాత, వేళంగిమాతల విగ్రహాలను ప్రారంభోత్సవం చేశారు. అనంతరం సాగరమాత కళావేదికపై నిర్వహించిన సమిష్టి దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొని దైవసందేశం అందజేశారు.సాయంత్రం మేరిమాత విగ్రహాన్ని విజయపురిసౌత్ వీధుల్లో ఊరేగిస్తూ పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు.సాగరమాత మహోత్సవాల సందర్భంగా మాచర్ల రూరల్ సిఐ షేక్ సమీముల్లా పర్యవేక్షణలో విజయపురిసౌత్ ఎస్ ఐ పి. అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 100 మంది పోలీస్ సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు.

బృహత్తర కార్యక్రమం కంటివెలుగు

నవతెలంగాణ-కోదాడరూరల్

పేదల జీవితాల్లో వెలుగులు నింపే బృహత్తర కార్యక్రమం కంటివెలుగు అని ఎంపీపీ చింతా కవిత రాధారెడ్డి అన్నారు. గురువారం మండల పరిదిలోని గుడిబండ గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, సర్పంచ్ లంకెల అలివేలు మంగమ్మ, జిల్లా వైద్యులు డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్షులు మహమ్మద్ సలీం, వార్డు సభ్యులు శేషు, సురేష్, శ్రీనివాసరెడ్డి, బిక్షం, అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.